# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 318 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 19 మార్చి 2026 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 318 19-03-2026 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-





పాఠకులకు, ప్రకటన కర్తలకు , శ్రేయోభిలాషులకు, ఖాతాదారులకు బంధుమిత్రులకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. నేడు మా కార్యాలయానికి సెలవు.

ఎ.రాజశేఖర్, ఎడిటర్








# పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి

- పోలవరం నిర్వాసితుల త్యాగం మరువలేనిది.. వారిని గుండెల్లో పెట్టుకుంటాం: సీఎం చంద్రబాబు
- నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని, భూములు, ఇళ్లు త్యాగం చేసిన వారిని తమ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుందని సీఎం చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. వారి త్యాగఫలితంగానే రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు సాకారం అవుతోందని అన్నారు. ఈరోజు తన క్యాంపు కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో సమావేశమైన సీఎం, భూసేకరణ, పునరావాస ప్యాకేజీ కింద మూడో విడతగా రూ.226.61 కోట్ల చెక్కును వారికి అందజేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ మొత్తాన్ని నేరుగా నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రాం వాల్ పనులు వారం రోజుల్లో పూర్తి కానున్నాయని ఆయన ప్రకటించారు.

### 21 నెలల్లో రూ.1943 కోట్ల పరిహారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితులకు అండగా నిలుస్తోందని, గత 21 నెలల్లో మూడు విడతల్లో పరిహారం అందించామని సీఎం వివరించారు. 2025 జనవరిలో సంక్రాంతి కానుకగా తొలి విడత రూ.800 కోట్లు, గత ఏడాది దీపావళికి రెండో విడతగా రూ.916 కోట్లు, తాజాగా ఉగాది సందర్భంగా మూడో విడతగా రూ.226.6 కోట్లు జమ చేశామని తెలిపారు. ఈ 21 నెలల కాలంలో మొత్తంగా 26,149 మంది నిర్వాసితులకు రూ.1943 కోట్లు చెల్లించినట్లు స్పష్టం చేశారు. నిర్వాసితుల సంక్షేమం కోసమే రంపచోడవరం నియోజకవర్గాన్ని పోలవరం జిల్లాగా ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.
ప్రతి నిర్వాసితుడికి రూ.3.5 లక్షల మేర ఇంటి నిర్మాణం కోసం ఇస్తున్నామని, ఇంటి స్థలం కోసం ఇచ్చే మొత్తాన్ని రూ.2 లక్షలకు పెంచామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తోందని అన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు చేస్తున్నామని వెల్లడించారు. దళారులను నమ్మి మోసపోవద్దని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి పుష్కరాలు మూడోసారి నిర్వహించే గౌరవం తనకు దక్కిందని ముఖ్యమంత్రి అన్నారు. పుష్కరాల నిర్వహణ కంటే ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని అన్నారు. అలాగే ఈ ప్రాజెక్టు ప్రారంభాని కంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తి కావడానికి మరో రూ.5 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులంతా ప్రజల హృదయాల్లో నిలుస్తారని అన్నారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలమే పోలవరం ప్రాజెక్టు అన్నారు. అందరికీ న్యాయం చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం ప్రాజెక్టు ఆరేడేళ్లు ఆలస్యమైందని అన్నారు. నిర్వాసితులంతా సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు.

### గత పాలకుల వల్లే ప్రాజెక్టు ఆలస్యం


గత పాలకుల నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే డయాఫ్రాం వాల్ తీవ్రంగా దెబ్బతిన్నదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు నిపుణులతో అధ్యయనం చేయించి, సుమారు రూ.1000 కోట్లతో కొత్త డయాఫ్రాం వాల్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ చేతగానితనం వల్లే పోలవరం ప్రాజెక్టు 6-7 ఏళ్లు ఆలస్యమైందని, కాంట్రాక్టర్లను మార్చకుండా ఉంటే ఇప్పటికే పూర్తయ్యేదని విమర్శించారు. వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నాటి పాలకులు పట్టించుకోలేదని, ప్రాజెక్టు ఏమైనా పర్వాలేదన్న అహంకారంతో వ్యవహరించారని మండిపడ్డారు. మూడో విడతతో కలిపి, 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1943.53 కోట్లను చెల్లించామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టు రెండు దశలుగా నిర్మితమవుతోందని తెలిపారు. తొలిదశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నట్లు వెల్లడించారు. 75 నిర్వాసిత కాలనీలలో ఇప్పటికే 26 పూర్తయ్యాయని, మిగిలిన49 కాలనీలు నిర్మాణంలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. వీటి నిర్మాణం ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి పూర్తవుతుందని అన్నారు.

### నిర్మాణ పనులు, పునరావాసం వేగవంతం

వచ్చే ఏడాది ఉగాది తర్వాత రెండు నెలల్లోనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, రాష్ట్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి గోదావరి పుష్కరాలు నిర్వహించే గౌరవం తనకు దక్కిందని, పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని అన్నారు. ప్రాజెక్టులో భాగంగా 75 పునరావాస కాలనీలు నిర్మిస్తుండగా, ఇప్పటికే 26 పూర్తి అయ్యాయని, మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితులందరికీ పక్కా ఇళ్లతో పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం రూ.3.5 లక్షలు, ఇంటి జాగా కోసం ఇచ్చే పరిహారాన్ని రూ.2 లక్షలకు పెంచామని తెలిపారు. నిర్వాసిత యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తామని కూడా సీఎం హామీ ఇచ్చారు.
ప్రభుత్వం అందిస్తున్న పరిహారంతో తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతున్నాయని నిర్వాసితులు ముఖ్యమంత్రికి వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే తమకు న్యాయం జరిగిందని, తమ ఖాతాల్లోకి డబ్బులు వస్తున్నాయని చెబుతూ పలువురు మహిళలు భావోద్వేగానికి గురయ్యారు. చంద్రబాబే కలకాలం సీఎంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, ఆర్ అండ్ ఆర్ అధికారులు పాల్గొన్నారు.

# పార్టీకి నష్టం చేసే వారిని మోయలేం..

## పుట్టా మహేశ్ వ్యవహారంపై చంద్రబాబు సీరియస్



తిరుపతి మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
మొయినాబాద్ డ్రగ్స్ కేసు వ్యవహారం తెలుగుదేశం పార్టీలో పెను తుపాను సృష్టిస్తోంది. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ పేరు ఈ కేసులో ప్రముఖంగా వినిపించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. క్రమశిక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో చంద్రబాబు ఈ అంశంపై స్పందిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యువతను రాజకీయాల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పుట్టా మహేశ్ కు ఎంపీ టికెట్ ఇస్తే, ఆయన ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి డ్రగ్స్ పార్టీలకు వెళ్లడం క్షమించరాని తప్పని, ఇలాంటి వారి ప్రవర్తన వల్ల పార్టీ సమాధానం చెప్పుకోవాల్సి రావడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దురలవాట్లతో పార్టీ పరువు తీసే వారిని మోయాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి లేదని చంద్రబాబు కుండబద్దలు కొట్టారు. టీటీడీ మాజీ చైర్మన్, ప్రస్తుత మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడైన మహేశ్... మంచి రాజకీయ నేపథ్యం ఉండి కూడా ఇలా ప్రవర్తించడం సరికాదని చంద్రబాబు హితవు పలికారు. ఇప్పటికే పార్టీ నుండి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, ఐదు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించామని గుర్తు చేశారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకులంతా ప్రజల్లో విశ్వసనీయతను కాపాడుకోవాలని, వ్యక్తిగత ప్రవర్తన విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు.

# 'దివ్యాంగ శక్తి'ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు

అమరావతి మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతులకు ఎపిఎస్ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళగిరి బస్టాండ్ నుంచి విభిన్న ప్రతిభావంతులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు బస్సు ప్రయాణం చేశారు. మంగళగిరి నుంచి పెనుమాక వరకు పల్లె వెలుగు బస్సులో విభిన్న ప్రతిభావంతులతో కలిసి నేతల ప్రయాణం చేశారు. కూటమి ప్రభుత్వంలో విభిన్న ప్రతిభావంతులకు అందుతున్న సంక్షేమ పథకాలు, వారి బాగోగుల గురించి సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్ అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ప్రారంభం సందర్భంగా ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలు, లబ్దిదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 'దివ్యాంగ శక్తి' పథకం కింద విభిన్న ప్రతిభావంతులకు పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారు. 40 శాతం, లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న వికలాంగులందరికీ స్త్రీ శక్తి పథకం కింద వర్తించే బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనుంది. వారితోపాటు వచ్చే సహాయకుల కు ఈ బస్సుల్లో 50 శాతం రాయితీ లభించనుం ది. ప్రస్తుతం 1.71 లక్షల విభిన్న ప్రతిభావంతులలకే లబ్ధి చేకూరుతుండగా.. పథకం విస్తరణతో ఇకపై 11.16 లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. ఇప్పటి వరకు 33,800 మంది సహాయకులకే రాయితీ లభిస్తుండగా.. ఇకపై 1.60 లక్షల మంది సహాయకులకు 50 శాతం రాయితీ లభించనుంది. దీంతో ప్రయోజనం పొందే మొత్తం లబ్ధిదారుల సంఖ్య 2.05 లక్షల నుంచి 12.76 లక్షలకు పెరగనుంది. ఇప్పటికే వికలాంగులకు, వారి సహాయకులకు మూడేళ్ల కాలానికి ఇచ్చిన పాసులు ఈ కొత్త పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసేందుకు ఉపయోగపడ తాయి. ఉచిత ప్రయాణానికి అవసరమైన డిజిటల్ పాస్‌లు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్, ఎపిఎస్ఆర్‌టిసి యాప్ ద్వారా పొందొచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండ్లలోని 134 కౌంటర్లలో వికలాంగులకు సేవలు అందుతాయి. ఈ యాప్‌లను సదరం యాప్‌తో అనుసంధానించడంతో ఫిజికల్ ధ్రువీకరణ పత్రాలు చూపించాల్సిన అవసరం లేదు. క్యూఆర్ కోడ్‌తో ఉచిత డిజిటల్ పాస్‌లు జారీ చేస్తారు. ఈ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.207 కోట్లు సబ్సిడీ అందించనుంది.

# విజయవాడలో వైయస్ఆర్‌సీపీ ఇఫ్తార్ విందు...

## ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్న వైయస్ జగన్



విజయవాడ, మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని విజయవాడలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు పాల్గొని ముస్లిం సోదరుల ఉపవాస దీక్ష విరమింపజేశారు. విజయవాడ నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి ముస్లిం మత పెద్దలు, ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ ముస్లిం సోదరులకు ముందస్తుగా "ఈద్ ముబారక్" అంటూ ఉర్దూలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం శాంతి, సోదరభావం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. సేవా భావం, దాతృత్వం, సామరస్యం వంటి విలువలను ఈ పర్వదినం ప్రతిబింబిస్తుందని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, పరస్పర గౌరవంతో జీవించాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఇఫ్తార్ విందులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం సోదరులు పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో ఉపవాస విరమణ చేశారు.

# దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన మంత్రి నారా లోకేశ్



ఉండవల్లి, మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
దివ్యాంగుల గౌరవం పెంచేలా ప్రజా ప్రభుత్వం కృషిచేస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించారు. మంగళగిరి బస్ స్టేషన్ నుంచి పెనుమాక వరకు దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ప్రయాణించారు.
అనంతరం ఉండవల్లి నివాసంలో 'దివ్యాంగ శక్తి పథకం' లబ్ధిదారులతో జరిగిన ఆత్మీయ విందు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులను ఆత్మీయంగా పలకరించిన మంత్రి లోకేశ్, తన పక్కన కూర్చొన్న శివనాగరాజు, సౌభాగ్య, ఖాశింబి, అన్నపూర్ణమ్మలతో మమేకమై మాటామంతీ కలిపారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగుల గౌరవం పెంచాలని, వారిలో పట్టుదల ఎక్కువ అని అన్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. వికలాంగుల ఆత్మగౌరవం ముఖ్యమని లోకేశ్ పేర్కొన్నారు. సమాజంలో కూడా మహిళలను కించపరిచే పదాలను అందరూ విడనాడాలని, ఇందుకోసం తాను పోరాడుతున్నానని అన్నారు.

**ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల**

"కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే డీఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేశాం. ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేస్తున్నాం. ఇకపై ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు రావడం ద్వారా ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి కల్పన జరగుతుంది. అందుకే అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నాం. మంగళగిరిలో ప్రభుత్వ భూమి లభ్యత చాలా తక్కువగా ఉంది. అందుకే కాజా వద్ద 75 ఎకరాల భూమి కొనుగోలు చేస్తున్నాం. మంగళగిరికి 4,5 ఐటీ కంపెనీలను తీసుకువస్తాం. సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తుంది" అని లోకేశ్ తెలిపారు.

**అమెరికా వెళ్లడం నా జీవితంలో అత్యుత్తమ నిర్ణయం**

స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని లోకేశ్ అన్నారు. స్త్రీలు ఎవరిపై ఆధారపడకూడదని అభిప్రాయపడ్డారు. ఇంటర్ తర్వాత అమెరికా వెళ్లడం తన జీవితంలో అత్యుత్తమ నిర్ణయమని తెలిపారు. అందుకే నా సొంత కాళ్లపై నిలబడగలిగానని, దాదాపు 8 ఏళ్లు నేను అమెరికాలో ఉన్నానని వెల్లడించారు. చదువుతో పాటు ఉద్యోగం చేశానని, దీంతో తనకు ఎంతో అవగాహన వచ్చిందని అన్నారు.
ఈ సందర్భంగా దివ్యాంగుల యోగక్షేమాలను, ప్రభుత్వం నుంచి అందుతున్న లబ్ధిని ఈ సందర్భంగా మంత్రి అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ అందుకున్న తర్వాత ఐవీఆర్ఎస్ కాల్స్, సీఎం సందేశం వస్తున్నాయా అని వాకబు చేశారు. తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రిని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వంలో అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. వారితో కలిసి ఫోటోలు దిగారు.





# ఏపీకి రెడ్ అలర్ట్..

## పలు జిల్లాల్లో పిడుగుపాటుతో కూడిన వర్షాలు



అమరావతి మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే మూడు గంటల్లో పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కఅష్ణా జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ది ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, ముఖ్యంగా చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రమాదం ఉండటంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

**LOST OF PASSPORT**

**I, Syed Ashraf Funnisa**
**W/o Syed Raffi**
R/o 13-04-55, Besta Palem, Chirala, Chirala Municipality, Bapatla District, Andhra Pradesh
My Son by Name **SYED SAMEER JAKRIYA AHMED,** Passport No. **X2940269,** My Daughter by Name **SYED ZAINAB,** Passport No. **X2940270,** My Daughter by Name **SYED JUWAIRIYAH,** Passport No. **X2940266** Lost his Passport on **17-03-2025** while we going to xerox shop from our house which was issued at Dated: 29/04/2024 the said passport was lost by my son at chirala center. So if any person who traced the Passport Contact
**Syed Ashraf Funnisa**
**Cell: 9573446210**

తెలుగురాష్ట్రం దినపత్రిక







## పాడైందో...ఉడికిందో తెలియని చికెన్‌తో వంటకాలు.

**-చింతపల్లిలో ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల ప్రాణాంతక దందా!- ఉడికని, నిల్వ చేసిన కోడి మాంసంతో వంటలు...ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ముప్పు.-దుర్వాసనతో బయటపడిన మోసం...ప్రశ్నిస్తే దురుసు ప్రవర్తన.- అపరిశుభ్ర వంటశాలలు, పాత నూనె వినియోగం...నూడిల్స్, ఫ్రై వంటకాలపై అనుమానాలు.- రహదారిపై పొగ, అడ్డంగా పార్కింగ్...ప్రమాదాలకు కారణం.**





**చింతపల్లి, మార్చి 18 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

చింతపల్లి పట్టణంలోని ఫాస్ట్ ఫుడ్, నూడిల్స్ సెంటర్లలో నాసిరకం ఆహార పదార్థాల వినియోగం బయటపడటంతో ప్రజల్లో తీవ్ర అసహ్యం, ఆందోళన వ్యక్తమవుతోంది. నిల్వ ఉంచి పాడైపోయిన చికెన్‌ను తిరిగి వండి నూడిల్స్, ఫ్రై వంటకాలలో వినియోగిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అధిక లాభాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. మంగళవారం సాయంత్రం వ్యవసాయ పరిశోధన కేంద్రం సమీపంలోని ఓ ఫాస్ట్ ఫుడ్ దుకాణంలో చికెన్ ఫ్రై కొనుగోలు చేసిన వినియోగదారులు ఆహారం నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వ్యక్తం చేశారు. చికెన్ ముక్కలు సరిగా ఉడకకపోవడం, రుచి మారిపోవడంతో దుకాణదారుని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకుండా వాగ్వాదానికి దిగినట్లు బాధితులు తెలిపారు. దొడ్డికొండ గ్రామానికి చెందిన కొర్ర ప్రసాద్ ఇలాంటి ఆహారం తిన్నమంటే ప్రాణాలతో ఆటే...ప్రశ్నిస్తే బెదిరింపులు చేస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల సమాచారం మేరకు పట్టణంలోని అనేక ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల్లో సరైన నిల్వ సదుపాయాలు లేకపోవడం, ఫ్రిజ్‌లు పనిచేయకపోవడం వల్ల మాంసం పాడైపోతున్నదని ఆరోపిస్తున్నారు. మిగిలిన చికెన్‌ను మరుసటి రోజు మళ్లీ వేయించి వినియోగించడం, పాత నూనెను పదేపదే వేడి చేసి వంటకాలు చేయడం, వంటశాలల్లో పరిశుభ్రత పాటించకపోవడం వంటి చర్యలు సాధారణమైపోయాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, రహదారి పక్కనే వంటకాలు చేయడం వల్ల వెలువడే పొగ ప్రయాణికుల కళ్లలో పడుతుంది. కళ్ళు మంటలను సరిచేసుకునేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నదని స్థానికులు అంటున్నారు. ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల ముందు వాహనాలు అడ్డంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పంచాయతీ, ఆరోగ్య శాఖ, ఆహార భద్రత అధికారుల పర్యవేక్షణ లోపమే ఇలాంటి దందాలకు కారణమని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. తక్షణమే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నాసిరకం ఆహారం విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లైసెన్సులు లేని కేంద్రాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు.

## రోడ్డే మార్కెట్‌గా మారిందా ఇక కఠిన చర్యలు!

**-చింతపల్లిలో మాంసం--చేపల దుకాణాలకు బ్రేక్.-ప్రధాన రహదారులపై అనధికార విక్రయాలకు పూర్తి నిషేధం.- ట్రాఫిక్‌కు అంతరాయం, దుర్వాసనపై ప్రజల ఆగ్రహం.-సంత మార్కెట్‌కే వ్యాపారం...లేనిచో స్వాధీనం, జరిమానాలు.-చింతపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటరావు.**






**చింతపల్లి, మార్చి 18 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

చింతపల్లి కేంద్రంలోని ప్రధాన రహదారులపై చేపలు, ఫారం కోళ్ల మాంసం విక్రయాలు నిర్వహిస్తున్న దుకాణాలపై చింతపల్లి పంచాయతీ కఠిన చర్యలు చేపట్టింది. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ సౌకర్యం దృష్ట్యా రోడ్డు పక్కన ఉన్న అనధికార దుకాణాలను పూర్తిగా నిషేధించింది. రహదారుల వెంట తాత్కాలికంగా ఏర్పాటైన దుకాణాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం, చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాపించడం పై స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చర్యలకు శ్రీకారం చుట్టారు. పంచాయతీ కార్యదర్శి ముక్కలి వెంకటరావు మాట్లాడుతూ, వ్యాపారులు సంత మార్కెట్‌లో కేటాయించిన దుకాణాల్లోనే విక్రయాలు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు పక్కన వ్యాపారం కొనసాగిస్తే దుకాణాల స్వాధీనం, జరిమానాలు, లైసెన్స్ రద్దు వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంసం, చేపల దుకాణాలు నిర్వహించే వారు పారిశుద్ధ్య నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వ్యర్థాలను చెత్త బిందెల్లోనే వేయాలని సూచించారు. పరిశుభ్రత లోపిస్తే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు కూడా అనధికార విక్రయాలను ప్రోత్సహించకుండా సంత మార్కెట్‌లోని అనుమతిపొందిన దుకాణాల నుంచే కొనుగోళ్లు చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి అంబేద్కర్, పంచాయతీ సిబ్బంది టి శివ, టి అనిల్ కుమార్, ఎం శ్రీను, పారిశుద్ధ్య కార్మికుడు నూకరాజు సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగులు పట్ల వరం దివ్యాంగ శక్తి పథకం

## -ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి








**రంపచోడవరం,మార్చి 18(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

దివ్యాంగులకు 'దివ్యాంగ శక్తి పథకం' ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్ బొజ్జి రెడ్డి పేర్కొన్నారు.బుధవారం స్థానిక ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ ప్రాంగణంలో దివ్యాంగ శక్తి పథకానికి ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి,ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, ఏపీవో జనరల్ డి ఎన్ వి రమణ, ఆర్టీసీ డిఎం సురోచిత మార్గరేటి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.దివ్యాంగ శక్తి పథకాన్ని ఎస్టీ కమిషన్ చైర్మన్ జెండా ఊపి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం చైర్మన్,ఎస్టీ కమిషన్ మెంబర్,ఏ.పీ.ఓ.జనరల్,ఆర్టీసీ డిఎం, కూటమి నాయకులు రంపచోడవరం నుండి పోలవరం జంక్షన్ వరకు దివ్యాంగ శక్తి పథకంలో భాగంగా దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేశారు . అనంతరం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో దివ్యాంగ శక్తి పథకం సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా చైర్మన్ బొజ్జి రెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగపరచుకోవాలని ఆయన అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి దివ్యాంగులు ఎంతో సంతోషించడం జరుగుతుందని ఆయన అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో దూర దృష్టితో దివ్యాంగుల సంక్షేమానికి అలాగే దివ్యాంగులు పడుతున్న కష్టాలను వారు తెలుసుకొని ఈ దివ్యాంగ శక్తి పథకం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు.ముఖ్యమంత్రి గుంటూరులో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించడం జరిగిందని ఆయన అన్నారు.ఈ దివ్యాంగ శక్తి పథకానికి 40% శాతం పైబడిన వారికి మాత్రమే ఈ పథకం లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందని, అలాగే దివ్యాంగులతో సహాయకులకు 50% చార్జీల రాయితీతో ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు.అందరూ సదరం సర్టిఫికెట్లు కలిగి ఉండాలని సదరం సర్టిఫికెట్లు లేని వారు వెంటనే అప్లై చేసి సర్టిఫికెట్లు పొందాలని సూచించారు .దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బస్సులో సురక్షితంగా ప్రయాణించే విధంగా దివ్యాంగులకు అనుకూలంగా ఉండే విధంగా బస్సు ఎక్కేందుకు వీలుగా ఉండే విధంగా స్టేప్స్ ను ఏర్పాటు చెయ్యాలని ఆర్టీసీ డిఎం ను చైర్మన్ కోరారు.రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని ఆమె అన్నారు.ఆర్టీసీ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో) ఉచితంగా ప్రయాణించవచ్చని ఈ పథకం ద్వారా దివ్యాంగుల ప్రయాణ సౌలభ్యాన్ని మెరుగుపరచడం మరియు వారికి సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వం యొక్క ప్రధాన ఉద్దేశమని ఆమె అన్నారు.ఏపీవో జనరల్ మాట్లాడుతూ దివ్యాంగుల కొరకు ప్రవేశపెట్టిన ఈ దివ్యాంగ శక్తి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.డిపో మేనేజర్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలోని దివ్యాంగుల కొరకు ప్రారంభించిన ఈ దివ్యాంగ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యానికి గోకవరం ఆర్టీసీ డిపోలో దివ్యాంగులకు బస్సు పాస్ లు ఇవ్వడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ పాస్ కొరకు కావలసినవి సదరం సర్టిఫికెట్, ఒక పాస్ ఫోటో సమర్పించినచో బస్సు పాస్ జారీ చేయడం జరుగుతుందని ఆమె అన్నారు ఈ బస్సు పాస్ మూడు సంవత్సరాల వరకు వ్యాలిడిటీ ఉంటుందని కొత్తగా నమోదు చేసుకునే వాళ్ళు వెంటనే గోకవరం బస్ డిపోకు వచ్చి నమోదు చేసుకోగలరని ఆమె అన్నారు. అలాగే మొబైల్ యాప్ ద్వారా కూడా ఈ బస్సు పాస్ నమోదు చేసుకోవచ్చని ఆమె అన్నారు. అనంతరం ఐటీడీఏ ద్వారా దివ్యాంగుల కొరకు భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, తాసిల్దార్ పి.బాలాజీ, ఐటిడిఏ ఏవో యర్రం శెట్టి రాజు, ఐటీడీఏ మేనేజర్ రాజు,కూటమి నాయకులు అడబాల బాపిరాజు, అనంత మోహన్, గణపతి, ఎలక్ట్రికల్ జేఈ కేఎస్ భాస్కరరావు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు కోసం తోటలే బలి కొర్రబయలులో గిరిజనుల ఆగ్రహం...జిల్లా యంత్రాంగం జోక్యం.

**- కాఫీ, మిరియాల తోటల మధ్యుగా రహదారి ప్రతిపాదనపై తీవ్ర ఉద్రిక్తత.-ఆర్డీవో--ఏఎస్పీ క్షేత్రస్థాయి పరిశీలన...గ్రామంలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు.- ప్రత్యామ్నాయ మార్గాల పరిశీలన...నివేదిక అనంతరం తుది నిర్ణయం, అప్పటివరకు పనులు నిలిపివేత.**





**చింతపల్లి, మార్చి 18 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

కొర్రుబయలు--జలగలగెడ్డ గ్రామాల మధ్య రహదారి వివాదం తీవ్ర రూపం దాల్చడంతో జిల్లా యంత్రాంగం అత్యవసరంగా జోక్యం చేసుకుంది. బుధవారం అధికారులు, పోలీసులు భారీగా గ్రామానికి చేరుకుని ప్రతిపాదిత రహదారి మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇరు వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో గుమికూడడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు పాడేరు ఆర్డీవో లోకేశ్వరరావు, చింతపల్లి సబ్‌డివిజన్ అడిషనల్ ఎస్పీ నవజ్యోతి మిశ్రా ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు, అటవీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేపట్టారు. కోర్రుబయలు నుంచి జలగలగెడ్డకు వెళ్లే ప్రధాన మార్గంతో పాటు జలగలగెడ్డ నుంచి రూథర్‌ఫోర్డ్ గెస్ట్ హౌస్‌కు వెళ్లే మార్గాలను కూడా పరిశీలించి, ప్రత్యామ్నాయ రూట్ల సాధ్యతను అంచనా వేశారు. జలగలగెడ్డ గ్రామానికి ప్రతిపాదిత రహదారి కొర్రబయలు గిరిజనుల కాఫీ, మిరియాల తోటల మధ్యుగా వెళ్లే అవకాశంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలు ముందుండి అధికారులను ఆపి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మా తోటలే మా బతుకుదెరువు...రోడ్డు పేరుతో వాటిని నాశనం చేయొద్దు అంటూ వేడుకున్నారు. తోటలు నష్టపోతే కుటుంబాలు ఉపాధి కోల్పోతాయని వారు స్పష్టం చేశారు. ఆర్డీవో లోకేశ్వరరావు మాట్లాడుతూ రెండు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి తోటలకు కలిగే నష్టాన్ని అంచనా వేశామని, పూర్తి నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. నివేదిక ఆధారంగా తుది నిర్ణయం తీసుకునే వరకు ఎలాంటి రహదారి నిర్మాణ పనులు చేపట్టబోమని స్పష్టం చేశారు. అప్పటి వరకు ఇరు వర్గాలు శాంతి, సహనం పాటించాలని సూచించారు. ఈ నెల 3న జరిగిన గొడవలపై ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు అడిషనల్ ఎస్పీ నవజ్యోతి మిశ్రా తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె. శంకరరావు, సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్సై వీరబాబు తదితరులు పాల్గొన్నారు. వివాదానికి శాశ్వత పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం తీసుకునే నిర్ణయంపై ఇరు గ్రామాల్లో ఉత్కంఠ నెలకొంది.

## ముస్లింల అభివృద్ధికీ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ -మల్లవోలు నూర్ మసీదు లో ఇఫ్తార్ విందు- రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**



**గూడూరు, తెలుగు రాష్ట్రం విలేఖరి, మార్చి 18**

రాష్ట్రంలోని ముస్లింల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పెడన నియోజకవర్గం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు.గూడూరు మండలం మల్లవోలు నూర్ మసీదులో బుధవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠిన నియమాలతో ఉపవాస దీక్షలు చేపడతారని, సమాజంలో పరస్పర సహకారం, దాతృత్వం ఎంతో ముఖ్యమని ఖురాన్ బోధిస్తుందన్నారు. అలాంటి విలువలను ప్రతి ఒక్కరు ఆచరించాలని కోరారు. అనంతరం ఇఫ్తార్ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కు ముస్లిం మత పెద్దలు ఘన స్వాగతం పలికారు.

## నూకాంబిక జాతరలో కట్టుదిట్టమైన బందోబస్తు-సీఐ విద్యాసాగర్ పర్యవేక్షణ



**ఆలమూరు మార్చి 18 (తెలుగు రాష్ట్రం రిపోర్టర్ )**

ఆలమూరు మండలం చింతలూరు గ్రామంలో జరుగుతున్న శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర తీర్థ మహోత్సవం సందర్భంగా భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం మరియు శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.జాతర ప్రాంగణంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు సీఐ విద్యాసాగర్ స్వయంగా పర్యవేక్షణ చేపట్టారు. ముఖ్యంగా క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో పోలీసులు నిరంతరం పహారా కాస్తూ భక్తులకు భద్రత కల్పిస్తున్నారు.మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ, భక్తుల రాకపోకలను సజావుగా నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే చర్యలు తీసుకునేలా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.అనంతరం సీఐ విద్యాసాగర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేందుకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.






తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
గురువారం 19 మార్చి 2026

## కే. ఏనుగుపల్లి లో రైతన్న మీకోసం



**పి. గన్నవరం (తెలుగు రాష్ట్ర విలేకరి )**

పి. గన్నవరం మండలం కె. ఏనుగుపల్లి గ్రామంలో కూటమి నాయకులు రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాల గురించి, వివిధ వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ ల గురించి వివరించారు. గ్రామస్తులకు ఆయన కరపత్రాలు అందజేశారు. మాజీ ఎంపీటీసీ, టిడిపి సీనియర్ నాయకులు శేరు శ్రీనుబాబు, తెదేపా యూనిట్ ఇన్చార్జ్ నిమ్మకాయలశేషు జనసేన నాయకులు తోలేటి దివాకర్ కానూరి శేషారావు అలాగే రైతులు తొలేటి గంగాచలం, తోలేటి రఘురాముడు, బోనం సత్యనారాయణ, బోనం నాగేశ్వరావు, తోలేటి త్రిమూర్తులు( ఐవీ) తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీ వేంకటేశ్వర కళాశాలలో ఉగాది వేడుకలు






**అమలాపురం, మార్చ్ 18 తెలుగు రాష్ట్రం న్యూస్**

శ్రీ వేంకటేశ్వర కళాశాలలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి పంచాంగ పటనం నిర్వహించారు.సాంప్రదాయ వస్త్రాలు ధరించి తెలుగు కవి సి.హెచ్.సంసోన్ ను సత్కరించారు.ఈ కార్యక్రమంలో కె.వి.ఆర్.ఎన్.నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్,కరాటం .ప్రవీణ్,వై.వరప్రసాద్,సి. హెచ్.జాన్‌పాల్,అరుణ్,వి.ఆర్.ఓ.భరత్,డా.రాయుడు.శ్రీరామచంద్ర మూర్తి,విద్యార్థులు,తదితరులు పాల్గున్నారు,ఉగాది పచ్చడి పంపిణి చేసారు.

## కులమతాలకు అతీతంగా ఉగాది జాతర జరుపుకోవడం అభినందనీయం -ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, మార్చి18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కుల మతాలకు అతీతంగా పూర్వీకుల నుంచి మహంకాళి, మహాలక్ష్మి అమ్మవార్ల ఉగాది జరుపుకోవడం ఎంతో ఆనందదాయికమైన విషయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండలం పడమరవెప్పరు గ్రామంలో ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా మహంకాలమ్మ మహాలక్ష్మి అమ్మవార్ల జాతర వైభవంగా జరుగుతుంది. ఐదు రోజులు నిర్వహించే ఈ జాతర మహోత్సవం ఉదయం కలస పూజతో ప్రారంభమైంది. సుమారు 500 మంది మహిళలు కలశాలతో చెరువు నుంచి నీరు తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. రాత్రి జాతర కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, బిజెపి నియోజకవర్గ ఇంచార్జ్ ఈతకోట తాతాజీ హాజరయ్యారు. వారికి ఆలయ ఈవో చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా జాతర చేయడం చాలా గొప్ప విషయమని, దీన్ని మన ముందు తరం వారు ప్రారంభిస్తే ఈ తరం వారు కూడా ఆచరిస్తుండటం అభినందనీయమని కొనియాడారు. అమ్మవారి కరుణా కటాక్షం దయ గ్రామం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, అదేవిధంగా మంచి పంటలు పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ జాతర గత 100 సంవత్సరాల నుంచి పసల వారి కుటుంబ సభ్యులు చేస్తున్నారన్నారు. జాతర అనేది గ్రామ సౌభాగ్యం కోసం, గ్రామాల్లో ఏ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఈ జాతర మహోత్సవాలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కె పెంటపాడు గ్రామంలో కోట్లమ్మ తల్లి జాతర మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పసల అచ్యుతం, తోట రాజా, పసలు కొండ, పసలు శ్రీకృష్ణ, పాలూరి వెంకటేశ్వరరావు, గంధం సతీష్, చాపల రమేష్, గణేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

## -విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూసిన -ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు









**అమలాపురం, మార్చి 18, తెలుగు రాష్ట్రం న్యూస్**

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన ఆదేశాల మేరకు అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు బుధవారం అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లిలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ పర్యటనలో ఎమ్మెల్యే పాఠశాల రికార్డులను పరిశీలించి, తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. విద్యా బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను స్వయంగా పరిశీలించేందుకు ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.వంట చేసే సిబ్బందితో మాట్లాడి, ప్రతిరోజూ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మన విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దుతున్నారని, విద్యార్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.స్కూల్ ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.ఎమ్మెల్యే వెంటా రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు , అముడా చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి , బిజెపి నాయకులు యాళ్ల దొరబాబు మరియు తదితరులు పాల్గొన్నారుల

## దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన "దివ్యాంగుల శక్తి" ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు.











**పి. గన్నవరం (తెలుగు రాష్ట్ర విలేకరి )....**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరంలో దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన "దివ్యాంగుల శక్తి" ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం దివ్యాంగుల అవసరాలను పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల గౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటోందన్నారు. పెన్షన్‌ను రూ. 6000లకు పెంచడంతో పాటు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా వారి రోజువారీ జీవితానికి ఉపశమనం కలిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం వారికి ప్రత్యేకంగా భోజన సదుపాయం కల్పించి, స్వయంగా వడ్డిస్తూ వారితో కూర్చుని వారి కష్టసుఖాలు తెలుసుకుని భోజనం చేశారు. ఈ చర్యతో దివ్యాంగుల పట్ల ఆయన చూపిన ఆప్యాయత ప్రశంసలు పొందింది.అదేవిధంగా కార్యక్రమానంతరం ఉచీ+జ వారు అందించిన రెండు వాటర్ ట్యాంకులను కూడా ఆయన ప్రారంభించారు. దివ్యాంగుల సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, జనసైనికులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## భట్నవిల్లిలో 'రైతన్నా మీకోసం' వారోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు







**అమలాపురం మార్చ్ 18 తెలుగు రాష్ట్రం న్యూస్**

అన్నదాతల కష్టాలను తీర్చటానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా బుధవారం అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి గ్రామంలో జరిగిన 'రైతన్నా మీకోసం' వారోత్సవాల్లో శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు స్వయంగా పర్యటించారు. భట్నవిల్లి గ్రామంలో ప్రతి రైతు ఇంటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వం అందిస్తున్న రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. రైతులకు అండగా ఉండటానికి 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ఏడాదికి రూ. 20,000 ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే రైతులకు వివరించారు. విత్తనం నుండి విక్రయం వరకు ప్రతి దశలోనూ రైతుకు తోడుగా ఉంటామని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వీడి సాగును పండుగ చేస్తామని ఎమ్మెల్యే గారు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి నాయకులు మరియు భట్నవిల్లి గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అగ్ని ప్రమాద బాధితులకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరామర్శ

**రాజోలు, మార్చి 18 (తెలుగు రాష్ట్రం ప్రరినిధి ):**

శివకోటి 18 ఎకరాల కాలనీ అగ్ని ప్రమాదం జరిగి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గారు ప్రమాద ప్రాంతానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్ని ప్రమాదం వలన నష్టపోయిన కుటుంబాలకు అండగా ఉంటామని అదేవిధంగా ప్రభుత్వం తరపున అందించే సాయాన్ని బాధిత కుటుంబాలకు అందిస్తాం అని అన్నారు. నాలుగు కుటుంబాల వారికి దుప్పట్లు, వస్త్రాలు ఒక్కో కుటుంబానికి 2000 రూపాయలు నగదు, 25 కేజీ ల బియ్యం అందజేశారు. నూతన గృహాలను మంజూరు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.



# తెలుగురాష్ట్రం దినపత్రిక



తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలు

https://epaper.teluguraastram.com



అమలాపురం
మార్చి 19
గురువారం 2026




## పారిశుధ్య మహిళలకు ఘన సత్కారం

### - ముఖ్యఅతిథిగా సోము వీర్రాజు



**రాజమహేంద్రవరం మార్చ్ 18: ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి )**

రాజమండ్రి మెయిన్ రైల్వే స్టేషన్‌లో "నారీ శక్తి స్వచ్ఛత" పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది.రైల్వే అడ్వైజరీ కమిటీ బోర్డు సభ్యులు, రైల్వే సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణలో విశేష సేవలు అందిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం మరియు ఉగాది పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా పారిశుద్ధ్య కార్మికులకు దుస్సాలువాలు కప్పి, చీరలు, పండ్లు, మిఠాయిలు అందజేసి గౌరవించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల అంకితభావం, సేవలను కొనియాడారు. సమాజాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడంలో వారి పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, కాలెపు సత్యసాయిరాం, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పాలడుగు శ్రీవిద్య, మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్, తగరం సురేష్, క్షత్రియ బాల సుబ్రహ్మణ్యం సింగ్, కురగంటి సతీష్, పి.వి. సుబ్రహ్మణ్యం, బండి సత్యప్రసాద్, భోజి హరి రామ్, చింతపల్లి సతీష్, పైబోయిన సురేంద్ర, పరశురాం, అడపా వరప్రసాద్, కె.వి. కుమారి, రత్నా రెడ్డి, మువ్వల మహేష్, రైల్వే సిబ్బంది చంద్రమౌళి, చిదంబరం, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## గౌతమి సూపర్ బజార్ అక్రమ కట్టడాలపై వైసీపీ నిరసన




**రాజమండ్రి సిటీ, మార్చ్ 18: ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి)**

దేవి చౌక్ సమీపంలోని గౌతమి సూపర్ బజార్ అక్రమ కట్టడాలను హైకోర్టు ఆదేశాల మేరకు కూల్చివేయాలని వైసీపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీ మార్గాని భరత్, పార్లమెంట్ సమన్వయకర్త డాక్టర్ గూడూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ గౌతమి సూపర్ బజార్ విషయంలో తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని, హైకోర్టులో పిటిషన్ వేసి నిజాయితీని నిరూపించుకున్నానన్నారు. అక్రమంగా నిర్మించిన ఈ భవనంలో సెల్లార్ పార్కింగ్ లేకపోవడం, నిబంధనలు ఉల్లంఘించడం వంటి అంశాలను ప్రస్తావించారు.మున్సిపల్ అధికారులు హైకోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేసి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తదనంతరం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసం పెంచే 'దివ్యాంగ శక్తి'

### - దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో అర్ధరేటు ప్రయాణం

**రాజమహేంద్రవరం, మార్చ్ 18: ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి )**




సమాజంలో విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారికి మరింత సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరచే లక్ష్యంతో 'దివ్యాంగ శక్తి' పథకాన్ని బుధవారం రాజమండ్రి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ప్రారంభించారు. జెండా ఊపి పథకాన్ని ప్రారంభించిన అనంతరం, దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణిస్తూ వారి సమస్యలు, అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దివ్యాంగులకు ప్రత్యేక కానుకగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులతో పాటు వారి వెంట వచ్చే సహాయకులకు కూడా ఆర్టీసీ బస్సుల్లో గుర్తించిన కేటగిరీలలో 50 శాతం టికెట్ రాయితీ కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, వారికి అవసరమైన శారీరక, వైద్య, ఆర్థిక రంగాల్లో సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తున్నామని, ఉపాధి అవకాశాల కోసం రుణాలు, సబ్సిడీపై త్రిచక్ర వాహనాలు వంటి పథకాల ద్వారా వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమాజంలో దివ్యాంగులపై ఉన్న అవరోధాలను తొలగించి, వారిని ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అర్హులైన వారందరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, గౌరవానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా వారి జీవితాల్లో భరోసా నింపుతోందన్నారు. దివ్యాంగులను కేవలం దయతో కాకుండా, సమాన అవకాశాలు కల్పించే దిశగా చూడాల్సిన అవసరం ఉందని సూచించారు. విభిన్న ప్రతిభావంతులలో అపారమైన శక్తి, సామర్థ్యం, ఆత్మస్థైర్యం ఉన్నాయని, సరైన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుత విజయాలు సాధించగలరని అన్నారు.తదనంతరం తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే నివాసంలో దివ్యాంగులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రభుత్వం చేస్తున్న సహాయానికి జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ (ఆర్ఎంపీ) ఎస్. వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ కె. మాధవ్, పీఆర్వో బి.ఎస్. కుమార్, ఎస్.ఎం. ఏ.వి. రావు, కూటమి నాయకులు కుడుపూడి సత్తిబాబు, మజ్జి రాంబాబు, అత్తి సత్యనారాయణ, కాశీ నవీన్ కుమార్, నక్కా చిట్టిబాబు, వర్రే శ్రీనివాసరావు, పక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రూల్ 31డిపై స్పష్టత కోరిన ఎంపీ పురందేశ్వరి



**రాజమహేంద్రవరం, మార్చ్ 18: ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి )**

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఫ్లూ-క్యూర్డ్ వెర్జీనియా (ఎఫ్‌సీవీ) పొగాకు రైతుల సమస్యలను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ దృష్టికి తీసుకెళ్లారు. జీఎస్టీ రూల్ 31డీ కింద విలువ నిర్ణయ విధానంపై స్పష్టత ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.పొగాకు ఉత్పత్తులపై రిటైల్ విక్రయ ధర (ఆర్ఎస్‌పీ) ఆధారంగా పన్ను విధించడం వల్ల పన్నుల పునరావృత ప్రభావం ఏర్పడుతున్నదని పేర్కొన్నారు. రూల్ 31డీ ప్రకారం జీఎస్టీ భాగానికే రాయితీ కల్పిస్తున్నప్పటికీ, కేంద్ర ఎక్సైజ్ సుంకం, జాతీయ విపత్తు సుంకం (ఎన్‌సీసీడీ) అంశాలను పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల "పన్నుపై పన్ను" పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు.ఈ విధానం వల్ల చట్టబద్ధ సిగరెట్ ఉత్పత్తుల ధరలు పెరిగి, అక్రమ సిగరెట్ల వినియోగం పెరిగే ప్రమాదం ఉందన్నారు. దీంతో దేశీయంగా ఉత్పత్తి అయ్యే ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోలు తగ్గి, రైతులపై ప్రతికూల ప్రభావం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో రవాణా సమస్యలు, వ్యయాలు పెరగడం వల్ల ఎగుమతులపై కూడా ప్రభావం పడుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో రూల్ 31డీ విధానాన్ని పునఃసమీక్షించి, పన్నుల పునరావృత ప్రభావాన్ని పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని పురందేశ్వరి కోరారు.

## బస్సుల్లో ఉచిత ప్రయాణం

### -దివ్యాంగులకు ఊరట- కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, మార్చ్ 18: ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి)**



దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. "దివ్యాంగ శక్తి" పథకం కింద దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని బుధవారం స్థానిక హైటెక్ బస్టాండ్ వద్ద ప్రారంభించారు.ఈ సందర్భంగా కంబాల చెరువు నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కలెక్టర్ కీర్తి చేకూరి దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి వారిలో ఉత్సాహాన్ని నింపారు.అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు దివ్యాంగులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అధికారులు దివ్యాంగులతో ఆత్మీయంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దివ్యాంగుల ప్రయాణాన్ని సులభతరం చేయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం "దివ్యాంగ శక్తి" పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ వంటి ఐదు రకాల ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు.జిల్లాలో 21 కేటగిరీల్లో వైకల్యం ఉన్న సుమారు 40 వేల మంది దివ్యాంగులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, స్వయం ఉపాధి, ఉద్యోగావకాశాలు తదితర రంగాల్లో దివ్యాంగులు ఆత్మనిర్భరులుగా ఎదగడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు.రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ప్రకటించిన పథకాలలో భాగంగా "దివ్యాంగ శక్తి" అమలు చేస్తున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంలో ప్రభుత్వం మానవీయ దృక్పథంతో ముందుకు సాగుతోందని అన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, డి.ఆర్.ఓ టి. సీతారామమూర్తి, జిల్లా ప్రజా రవాణా అధికారి వై.ఎస్.ఎన్. మూర్తి, ఏ.వో మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగజ్జీవన్ రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

### - 118వ జయంతి వేడుకలకు సన్నాహాలు - ఆహ్వాన పత్రిక ను ఆవిష్కరించిన కమిటీ సభ్యులు



**రాజమహేంద్రవరం, మార్చ్ 18 : ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి )**

మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు ఏప్రిల్ 5వ తేదీన రాజమహేంద్రవరం స్థానిక చర్చిపేట చర్చ్ గేటు ఎదురుగా, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ నాయకులు ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి దొండపాటి కృష్ణ ఫర్, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి తుత్తరపూడి రమణ, హితకాణి సమాజం మాజీ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ దొండపాటి సుధాకర్ లు పేర్కొన్నారు. బుధవారం రాజమండ్రి జాంపేట, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం దొండపాటి సుధాకర్, తుత్తరపూడి రమణ, దొండపాటి కృష్ణ ఫర్ మాట్లాడుతూ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి అనేక సేవలు అందించారని అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ గా 8 సార్లు పార్లమెంట్ కు ఎన్నికైనట్లు వివరించారు. ఆయన భారత రాజ్యాంగంలోని రిజర్వేషన్లు అమలకు విశేష కృషి చేశారని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, కార్మిక శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి అనేక సేవలు అందించారని అన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డు బహుకరించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5న భారత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహ నిర్మాణ దాత రెడ్డి మణేశ్వరరావు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,ఆర్యా పురం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, టిడిపి అధికార ప్రతినిధి గన్ని కృష్ణ, జనసేన పార్టీ రాజమండ్రి ఇంచార్జ్ అనుశ్రీ సత్యనారాయణ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి యావన్మంది హాజరై పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో జాన్ వెస్లీ, సూరిబాబు, రాజేష్ ,చిరంజీవి, సుధాకర్, సురేష్ ,కన్నా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో కుల వివక్ష సెగ.. మృతదేహం తరలింపుపై వివాదం!

### పీ. గన్నవరం మండలంలో ఉద్రిక్తత ప్రధాన రహదారిపై అడ్డగింత..

### తోటల గుండా వెళ్లాలని హుకుం పోలీసుల నిర్లక్ష్యంపై బాధితుల, దళిత సంఘాల ఆగ్రహం..

**పిగన్నవరం, మార్చి 18 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**



కుందాలపల్లి గ్రామం పి.గన్నవరం మండలంలోని అంబేద్కర్ నగర్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మరణంలోనూ వివక్ష నీడలు వీడకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామానికి చెందిన కాట్రు శ్రీనివాస్ (మరణం: 16-03-2026) అంతిమ యాత్రను కొందరు వ్యక్తులు అడ్డుకోవడంతో గ్రామంలో కుల వివక్ష సెగలు రాజుకున్నాయి. గత సోమవారం మృతి చెందిన శ్రీనివాస్ మృతదేహాన్ని దహన సంస్కారాల కోసం అంబేద్కర్ నగర్ నుంచి ప్రధాన రహదారి మీదుగా తీసుకెళ్తుండగా, పప్పుల లక్ష్మణరావు, పప్పుల సాయి, పప్పుల శ్రీనివాసరావు తదితరులు అడ్డుతగిలారు. మృతదేహాన్ని ప్రధాన రహదారి గుండా తీసుకురావద్దని, తోటల మార్గం గుండా వెళ్లాలని హుకుం జారీ చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. సంప్రదాయబద్ధంగా సాగాల్సిన అంతిమ యాత్రలో ఇలాంటి అడ్డంకులు సృష్టించడంపై దళిత సామాజిక వర్గీయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుపై మండిపాటు.. ఘటన జరిగిన రోజే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, నేటి వరకు నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదును నిర్లక్ష్యం చేయడం వల్లే గ్రామంలో అశాంతి నెలకొందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళిత సంఘాల పరామర్శ.. ఈ నేపథ్యంలో బుధవారం దళిత సంఘాల నాయకులు బొంత రమణ ఆధ్వర్యంలో బృందం బాధితుల గ్రామాన్ని సందర్శించింది. బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆధునిక కాలంలోనూ మృతదేహం తరలింపుపై ఆంక్షలు విధించడం అమానుషమని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వి. సి. కె పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, దళిత సేన మెండి డేవిడ్ అంబేద్కర్, మాల మహానాడు సాపే రమేష్,పులిదిండి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపియంపిఏ వినతి



**జగ్గయ్యపేట, మార్చి 18 (తెలుగురాష్ట్రం విలేకరి):**

పట్టణంలో జయప్రద ఫౌండేషన్ వారు జర్నలిస్టు కుటుంబాలకు నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, కెడిసిసి బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, మాజీ యం.యల్.సి తొండపు దశరథ జనార్ధన్, పి4 చైర్మన్ పి. కుటుంబరావు లను సన్మానించి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఏపియంపిఏ జగ్గయ్యపేట అధ్యక్షులు కాకరపర్తి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులందరికి నిబంధనలను సడలించి అక్రెడిటేషన్ ఇవ్వాలి. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రాంతంలో పాత్రికేయులందరికి సుమారు 3 నెలలో ఉచితంగా ఇండ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయించి, గృహ నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక చేయూతని అందించాలి. పాత్రికేయుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. సంక్షేమ నిధికి 50 కోట్లు కేటాయించాలి. సీనియర్ జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాలలో అమలులో ఉన్న విధంగా పెన్షన్ సౌకర్యం కల్పించాలి. పాత్రికేయులకు ఉచిత రైల్వే పాస్ లను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోండి. పాత్రికేయులు ప్రయాణించే కారుకు ఉచిత టోల్ గేట్ సౌకర్యాని కల్పించాలి. జగ్గయ్యపేట నుండి విజయవాడ వైపు గల ఉన్న రెండు టోల్ గేట్ కి పాత్రికేయుల కార్లకు ఉచిత టోల్ గేట్ ని తమరి సిఫార్సు తో కల్పించాలి. పాత్రికేయుల విధి నిర్వహణలో భాగంగా కావాల్సిన కెమోరాలకు, సెల్ ఫోన్ లకు, ఆడియో, వీడియో కి సంబంధించిన వస్తుల కొనుగోలు కోసం ప్రభుత్వ సబ్సిడీ తో అందించాలి. మా సంస్థ కి సంబంధించిన జగ్గయ్యపేట కమిటీ కి ప్రభుత్వం ఉచితంగా స్థలాన్ని కేటాయించాలని తమరిని కోరుతున్నాము. జగ్గయ్యపేట నియోజకవర్గంలో గల మండలాలు వారీగా గల ప్రెస్ క్లబ్ అనేది ఆయా మండలాలలో గల పాత్రికేయులందరిది కాదని తమరు గమనించగలరు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో గల మండలాలలో గల ప్రతి ప్రభుత్వ కార్యాలయాలు పెద్ద, చిన్న అని తేడా చూపించకుండా ప్రెస్ కవర్ కోసం పాత్రికేయులందరిని ఆహ్వానించేలా, సీరియల్ ప్రకారం అడ్వర్టైజ్మెంట్ ఇప్పించేలా చూడాలని తమరిని కోరుతున్నాము. మండల కేంద్రాలలో పాత్రికేయుల నైపుణ్యాని పెంచడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రెస్ అకాడమీ ద్వారా ఉచితంగా శిక్షణ అందించాలని కోరుతున్నాము. పి4 లో భాగంగా జర్నలిస్టు లకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫిషనల్ అసోసియేషన్ (ఏపియంపిఏ) జగ్గయ్యపేట నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు కాకరపర్తి రమేష్, కార్యదర్శి గడ్డం రాంబాబు, జిల్లా కార్యదర్శి కళ్యాణపు సూర్యప్రకాశరావు, జిల్లా కమిటీ సభ్యులు మెటికల శ్రీనివాసరావు, కమిటీ బేతు రంగా, మాల్యాద్రి(వంశీ), బి.యశ్వంత్, కరిసే మధు, బాణావత్తు సురేష్,తాళ్ళూరి దుర్గారావు, శ్రీరాం సింగ్, పుష్పా, కాకరపర్తి సోమేశ్వరావు, యంద్రాతి రాకేష్, గోళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ లకు జయప్రద ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం




**జగ్గయ్యపేట, మార్చి 18 (తెలుగురాష్ట్రం విలేకరి):**

జయప్రద ఫౌండేషన్ చైర్మన్ శ్రీ తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో బుధవారం ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా వారికి, వారి బంధుమిత్రులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ నేపథ్యంలో మొత్తం 251 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో వివిధ రకాల వైద్య సేవలలో కంటి పైద్య సేవలు పొందిన వారు 183 మంది, వారిలో కంటి చూపు లోపం ఉండి కళ్ళజోడులు అవసరమైన వారు 135 మంది. అలాగే శుక్లములు ఉన్నవారు 5 మంది, పొరలు 3, మొత్తం 8 మంది. వీరికి త్వరలో శంకర్ నేత్ర చికిత్సాలయం విజయవాడ వారి వద్ద ఆపరేషన్లు చేయబడునని తెలిపారు. అలాగే కళ్ళజోడుల అవసరమైన వారందరకు జయప్రద ఫౌండేషన్ వారి ద్వారా కళ్ళజోడులను త్వరలో అందజేయబడునని తెలిపారు. జనరల్ వైద్య శిబిరంలో 131 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. గుండె పరీక్షలు 108 మందికి నిర్వహించబడి, ఈసీజీ టెస్టులు 90 మందికి, 2డి ఎకో టెస్టులు 90 మందికి చేశారు. క్యాన్సర్ స్క్రీనింగ్ ఓపి 12 మందికి, పేప్సమేయర్ స్క్రీనింగ్ టెస్ట్ లు 12 మందికి, బ్రెస్ట్ స్క్రీనింగ్ టెస్ట్ లు 9 మందికి నిర్వహించారు. వెరికోస్ వెయిన్స్ టెస్టులు 25 మందికి నిర్వహించారు. షుగరు, బిపి, రక్త టెస్టులు 203 మందికి, హెచ్బి టెస్టులు 201 మందికి నిర్వహించడమైనది. అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ రావు, కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మాజీ మంత్రివర్యులు నెట్టెం శ్రీ రఘురాం, మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు పి4 చైర్మన్ చెరుకూరి కుటుంబరావు, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య,జగ్గయ్యపేట నియోజకవర్గం ఏపీఎంపీఏ అసోసియేషన్ అధ్యక్షులు కాకరపర్తి వెంకట రమేష్, ఫౌండేషన్ మెంటార్ శ్రీమతి చెరుకూరి చాముండేశ్వరి, హర్ష వ్యాస్కులర్ సెంటర్ డాక్టర్ హర్ష, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఆదిత్య, వివిధ హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్ మీడియా ప్రతినిధులు జయప్రద ఫౌండేషన్ వాలంటీర్లు, వాగ్దేవి కళాశాల బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## నవోదయకు ఎంపికైన విద్యార్థిని సిద్ధాంతపు మౌనిక

### -పలువురు అభినందనలు.

**కోరుకొండ మార్చి 18 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**



మండలంలోని కోటికేశవరం విద్యార్థి సిద్ధాంతపు మౌనిక నవోదయకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు భగవాన్ తెలిపారు. బుధవారం కోటి కేశవరం న్యూకాలనీ 3వ పాఠశాలకు చెందిన మౌనిక నవోదయకు ఎంపిక కావడం పట్ల ఉపసర్పంచ్ కొమ్మనాపల్లి గంగరాజు , ఉపాధ్యాయ సిబ్బందిని విద్యార్థిని మౌనిక ను అభినందించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కొమ్మనాపల్లి మాట్లాడుతూ మౌనిక తమ గ్రామానికి మంచి గుర్తింపు తెచ్చిందని, భవిష్యత్తులో చదువుల్లో చక్కగా రాణించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆశీర్వదించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు భగవాన్ ను ఘనంగా సత్కరిస్తూ, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







తెలుగురాష్ట్రం దినపత్రిక

# దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం :ఎమ్మెల్యే బత్తుల

### -దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే





**రాజానగరం మార్చి 18 ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి ):**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం కోరుకొండ బస్టాండ్ వద్ద దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో దివ్యాంగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వంలో వాటిని అధిగమించి వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు 4వేల పెన్షన్‌ను, 6వేలకు పెంచడం, ఉగాది కానుకగా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం దివ్యాంగ శక్తి పథకానికి ఆర్టీసీకి ఏడాదికి 207 కోట్ల రూపాయలు చెల్లిస్తుందన్నారు. దివ్యాంగులతో పాటు ప్రయాణించే సహాయకులకు టికెట్ ధరలో 50% రాయితీ ఇస్తున్నామన్నారు. ఈ పథకం 40శాతం అంగవైకల్యం ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందన్నారు.బత్తుల దంపతులు, మండల స్థాయి అధికారులు దివ్యాంగులతో కలిసి బస్సులో గాదరాడ బత్తుల స్వగృహానికి వెళ్లి, బత్తుల దంపతులు వడ్డిస్తూ, దివ్యాంగులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఎస్ భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, తాసిల్దార్ సుగుణ, సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణమూర్తి, ఎస్సై అంకారావు, జనసైనికులు అడ్డాల శ్రీను, బదిరెడ్డి దొర,ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ, జాజుల గణేష్, కర్రి గణేష్, ఎన్డీఏ నాయకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో రైతు రారాజు

### - రైతుల పక్షపాతి చంద్రబాబు -రైతన్నా మీకోసమే ఈ సంక్షేమ పథకాలు- ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



**గూడూరు, తెలుగు రాష్ట్రం విలేకరి మార్చి 18**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రైతే రారాజు గా నిలిచారని పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు.రైతన్నా మీకోసం కార్యక్రమనికి కృష్ణాజిల్లా అధ్యక్షుడు వీరంకి గురు మూర్తి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ....పాడి పరిశ్రమకు పెద్ద పీట వేస్తూ రైతులకు గోకులం షెడ్లు,డ్రిప్ ఇరిగేషన్,హార్టీ కల్చర్ రైతులకు ప్యాక్ హౌస్ సకాలంలో రైతులకు పెట్టుబడి సాయం లాంటి కార్యక్రమాలు చేస్తూ రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు.అనంతరం కూటమి శ్రేణులు రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మల్లవోలు గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.రైతు సంక్షేమానికి అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను రైతులు సధ్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.పార్టీలకు అతీతంగా ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని అన్నారు.అదే కూటమి ప్రభుత్వం గొప్పతనం అని పేర్కొన్నారు.మండల అధ్యక్షుడు గోపి నాగబాబు మాట్లాడుతూ..పొలం పిలుస్తోంది కార్యక్రమాలతో అనేక సంక్షేమ పథకాలను రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గోపి నాగబాబు కోరారు.అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రతి రైతుకు అందించిన ఘనత కూటమి ప్రభుత్వందేనని స్పష్టం చేశారు.రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని రైతు పంటలతో ప్రతి పేదవాడికి ఆకలి బాధలను తీర్చే అన్న క్యాంటిన్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేయడం తెలుగుదేశం పార్టీ ఘన చరిత్ర అన్నారు.అనంతరం కరపత్రాలను ఇంటిటింటికి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అన్నం హరి రామ కృష్ణ,పార్టీ ప్రధాన కార్యదర్శి తోట వేణు,ఎన్ ఏ బేగ్, మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు,అన్నం హరి రామ కృష్ణ, ఎన్ ఏ బేగ్, పోతుల రాము,కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు,,ముదినేని వేంకటేశ్వరవు ( కొండా), కోలపల్లి రజిని,మురాల దనేష్ఎజ్జు శివాజీ, కాట్రేడ్డి నాగ మురళి,బొర్రా శ్రీను, అగ్రికల్చర్ ఏవో జి రామకృష్ణ, వ్యవసాయ సిబ్బంది కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమం సామాజిక బాధ్యత

### -ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం,మార్చి18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
దివ్యాంగులను ఆదరించడం, వారి సంక్షేమానికి కృషి చేయడం, ఒక సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు గుర్తించాలని, ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో బుధవారం దివ్యాంగుల శక్తి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ పథకంతో దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. దివ్యంగులతో కలిసి ఎమ్మెల్యే బస్సులో ప్రయాణించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పెదతాడేపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు భూమి శ్రీనివాస్ పిల్లల చదువుల నిమిత్తం తన సొంత నిధులు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని వాటన్నిటిలోకెల్లా ఈ పథకం అత్యంత మానవీయ పథకంగా అభివర్ణించారు. సాటి మనుషులతో కలిసి జీవనం సాగించేందుకు దివ్యాంగులకు అవసరమైన తోడ్పాటు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు, సమాజంలోని ప్రతి ఒక్కరికి ఉందని వివరించారు. బిజెపి నియోజకవర్గ ఇంచార్జ్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నియోజకవర్గంలో అన్ని రోడ్లు ధ్వంసం అయ్యాయని, బస్సులు, ఆటోలు, వాహనాలు తిరగలేని దారుణ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఈ పరిస్థితిలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే ఎమ్మెల్యే రోడ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకొరత ఉన్నప్పటికీ, నియోజకవర్గ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు సాధించి తీసుకురావడం ఆయన అంకితభావానికి నిదర్శనమని తెలిపారు. శాసనసభలో ఎన్నో పర్యాయాలు నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించి, నిధులు సాధించారన్నారు. నిస్వార్ధంగా, నిజాయితీతో అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ కు ప్రతి ఒక్కరు అండదండలు అందించాలని సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు భోజనం ఏర్పాటు చేసి వారితో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాజరాజేశ్వరి, ఆర్టీసీ డిఎం దానమ్మ, స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జునరావు, ఆకాశపు స్వామి, వర్తనపల్లి కాశి, బొలిశెట్టి రాజేష్, తోటరాజ, పుల్లా బాబి, కిలపర్తి వెంకట్రావు, చాపల రమేష్, వాడపల్లి సుబ్బరాజు, పాలూరి వెంకటేశ్వరరావు, దినేష్ యాదవ్, మద్దాల మణికుమార్, పసల కొండ, గొర్రెల శ్రీధర్, దువ్వ శ్రీనివాస్, పై బోయిన రఘు, పై బోయిన వెంకట్రామయ్య, బేతిన గిరి, గడ్డం నాని, నల్లగంచి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


# క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

### -ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి



**తాడేపల్లిగూడెం, మార్చి17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే విజయ శిఖరాలను అధిరోహించవచ్చని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి. దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. ఏపీ నిట్ లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లబ్' మరియు విద్యార్థి కార్యకలాపాలు ఒ క్రీడల విభాగం సంయుక్తంగా నిర్వహించిన క్రీడా పోటీలు 2025–26 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యాభ్యాసంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు.శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని, క్రమం తప్పకుండా సాధన చేస్తూ తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని హితవు పలికారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా పట్టుదలతో కృషి చేస్తే విజయం తప్పక వరిస్తుందని వివరించారు.విద్యార్థి సంక్షేమ డీన్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూవిద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ గురించివివరించారు. ఈ కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న ఆచార్యులు డాక్టర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ నిట్ విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థులకు (బాలురు, బాలికలకు) మరియు అధ్యాపక సిబ్బందికి వేర్వేరుగా 16 రకాల క్రీడలు, 16 రకాల అథ్లెటిక్ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించనున్న వార్షిక క్రీడా దినోత్సవంలో పోటీల్లో గెలుపొందిన విజేతలకు పతకాలు మరియు ధృవపత్రాలను అందజేయనున్నామని వివరించారు. ముందుగా రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ రాజేశ్వర రెడ్డి, డాక్టర్ సునీల్, సాస్ సహాయకులు సంధ్యారాణి, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా స్ఫూర్తికి నిదర్శనం... రామ్మూర్తి నాయుడు



**రాజమహేంద్రవరం, మార్చ్ 18: (తెలుగు రాష్ట్రం ప్రతినిధి)**
రాజమండ్రిలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు అయినటువంటి నారా రామ్మూర్తి నాయుడు 74వ జయంతి వేడుకలు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి డాక్టర్ గుబ్బల రాంబాబు వృద్ధులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నిశ్శబ్దంగా నిలబడి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గుబ్బల రాంబాబు మాట్లాడుతూ, 1998లో స్వర్ణాంధ్ర సేవా సంస్థ స్థాపన సమయంలో రామ్మూర్తి నాయుడును వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎన్నుకున్నామని తెలిపారు. సంస్థ అభివృద్ధి, విస్తరణలో ఆయన చూపిన దూరదృష్టి, సేవా తపన సంస్థకు పునాది రాయి వంటిదని అన్నారు. ఆయన కృషి వల్లే నేటి స్థాయికి స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఎదిగిందని పేర్కొన్నారు.సామాజిక సేవలో ముందుండే నాయకుడిగా రామ్మూర్తి నాయుడు గుర్తింపు పొందారని, తూర్పు గోదావరి జిల్లాలో అనేక సేవా సంస్థలకు ఆయన ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. పేదలు, వృద్ధులు, నిరుపేదల పట్ల ఆయనకు ఉన్న మమకారం విశేషమని, సేవా కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారని చెప్పారు.సౌమ్య స్వభావం, స్నేహపూర్వక వైఖరి, సేవా తపనతో అందరి హృదయాలను గెలుచుకున్న వ్యక్తిగా ఆయన నిలిచిపోయారని కొనియాడారు. ఆయన సేవలను తరతరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో వృద్ధాశ్రమంలో చిత్రపటాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వృద్ధులకు ప్రత్యేక అన్నదానం నిర్వహించి, వారితో కలిసి భోజనం చేయడం ద్వారా కార్యక్రమానికి ప్రత్యేకత తీసుకొచ్చారు. వృద్ధులు కూడా రామ్మూర్తి నాయుడు సేవలను స్మరించుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ వై. హరికృష్ణ, సిబ్బంది పి. రాజేష్, జి. మీరాకుమారి, సింధు దివ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### - కలెక్టరేట్ వద్ద నిరసన చేసిన ఎస్.ఎఫ్.ఐ



**రాజమహేంద్రవరం, మార్చి 18 : ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి )**
తూర్పుగోదావరి జిల్లాలో ఫీజు తిరిగి చెల్లింపు (రీయంబర్స్మెంట్) బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని కొన్ని ఇంజినీరింగ్ కళాశాలలు విద్యార్థులను ఫీజులు చెల్లించమని ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి.ఈ సమస్యపై విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా నాయకులు వై. భాస్కర్, ఎన్. రాజా మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో ఫీజు తిరిగి చెల్లింపు చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫీజు మొత్తాన్ని నేరుగా కళాశాలల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించినప్పటికీ, కొన్ని కళాశాలలు విద్యార్థులను బలవంతంగా ఫీజులు చెల్లించమని ఒత్తిడి చేస్తున్నాయని విమర్శించారు.ప్రత్యేకంగా ఒక ఇంజినీరింగ్ కళాశాలలో ఫీజు చెల్లించకపోతే సెమిస్టర్ పరీక్షలకు దరఖాస్తు ఇవ్వమని హెచ్చరిస్తున్నారని తెలిపారు. మరో కళాశాలలో కూడా ఇలాంటి పరిస్థితి కొనసాగుతోందని పేర్కొన్నారు.ఇటీవల ఒక కళాశాల వద్ద విద్యార్థులు ఆందోళన చేపట్టగా, సంబంధిత అధికారులు స్పందించి ఫీజు తిరిగి చెల్లింపును పరీక్షలతో అనుసంధానం చేయబోమని హామీ ఇచ్చారు. అయితే ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులను తర్వాత లక్ష్యంగా చేసుకుని బెదిరిస్తున్నారని ఆరోపించారు.కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న కళాశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరీక్షల దరఖాస్తులు వెంటనే ఇవ్వాలని, ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించే వరకు విద్యార్థులను ఇబ్బంది పెట్టకూడదని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల పరీక్షలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోమని, అవసరమైతే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉగాది కానుకగా దివ్యాంగులకు "దివ్యాంగ శక్తి" పథకం

**కాకినాడ మార్చి 18 ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి ):**



ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ప్రత్యేకంగా "దివ్యాంగ శక్తి" పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద 40 శాతం పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, వారితో పాటు వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం కాకినాడ జగన్నాధపురం ప్రాంతంలో ఘనంగా నిర్వహించబడింది.రూరల్ ఎంపీపీ కర్రీ అనంతలక్ష్మి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ నిర్ణయం దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. ఉగాది పండుగ కానుకగా ఈ పథకం అమలు చేయడం గొప్ప విషయం అని అన్నారు.దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఎప్పుడూ అందుబాటులో ఉండి దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను గుర్తించి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలిపారు.ఇంకా గోపాల్ మాట్లాడుతూ, దివ్యాంగుల సమస్యలను స్వయంగా వినిపించుకుని పరిష్కారానికి హామీ ఇచ్చిన నాయకుడు చంద్రబాబు నాయుడేనని అన్నారు. విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు కల్పించడం పట్ల ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధిని కొనియాడారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గతంతో పోలిస్తే ఈసారి పథకంలో కీలక మార్పులు చేశామని తెలిపారు. ముందుగా కొన్ని వర్గాలకే పరిమితమైన సదుపాయాలను, ఇప్పుడు 21 రకాల అంగవైకల్యాలున్న వారందరికీ విస్తరించినట్లు చెప్పారు. 40 శాతం పైగా వైకల్యం ఉన్న ప్రతి దివ్యాంగుడికి ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని వివరించారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పూర్తిగా ఉచిత ప్రయాణం, ఏసీ, డీలక్స్ బస్సుల్లో 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు.పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ, ఈ పథకం దివ్యాంగులకు ఎంతో ఉపయోగపడుతుందని, ఉద్యోగాలు, వైద్యం, కుటుంబ అవసరాల కోసం ప్రయాణాలు సులభం అవుతాయని అన్నారు.సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, దివ్యాంగులకు పెన్షన్ పెంపు, ఉచిత బస్సు ప్రయాణం వంటి చర్యలు ప్రభుత్వ సంకల్పాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు కూడా దివ్యాంగులకు బస్సుల్లో కేటాయించిన సీట్లను గౌరవించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డిపిటివో శ్రీనివాసరావు, డిపో మేనేజర్ మనోహర్, పిఆర్వో వెంకటరాజు,దివ్యాంగుల శాఖ జిల్లా ఎడి. వై.శ్రీనివాస్,దివ్యాంగుల పాఠశాలల నుంచి వచ్చిన దివ్యాంగ విద్యార్థులు, సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం కొంతమంది దివ్యాంగులతో కలిసి ప్రజాప్రతినిధులు బస్సులో ప్రయాణించి, వారికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భోజన వసతి కల్పించారు.ప్రజాప్రతినిధులు, అధికారులు సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.

# గ్యాస్ ధర తగ్గించాలి పెరిగిన ధర కనుగొనంగా జీతాలు పెంచాలి

**కాకినాడ మార్చ్ 18 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి ):**




పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మెస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మేడిశెట్టి వెంకటరమణ, సంఘ కార్యదర్శి అనపర్తి ఏడుకొండలు మాట్లాడుతూ ఇరాన్ లో యుద్ధం జరుగుతుందని గ్యాస్ ధర పెంచి కార్మికుల నడ్డి విరిచే పని చేయడం చాలా బాధాకరమని అన్నారు. గ్యాస్ ధర పెరగడం వల్ల హోటల్స్ లో భోజనం టిఫిన్ రేట్లు కూడా పెరిగిన పని అన్నారు. పెరిగిన ధరల కనుగుణంగా వేతనాలు కూడా పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. యుద్ధం జరుగుతున్నప్పుడు ముందుగా గ్యాస్, ఆయిల్ నిల్వ ఉంచుకునే పని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, మెస్ యూనియన్ నాయకులు వై శంకర్, వై శ్రీను, రాజశేఖర్, శ్రీను, దుర్గమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
మార్చి 19
గురువారం 2026


# టీమిండియాకు పట్టిన దరిద్రం అదే..

## అశ్విన్ షాకింగ్ కామెంట్స్..!





**టీమ్ ఇండియా మాజీ స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ మరోసారి తన బహిరంగ వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచాడు. భారత క్రికెట్‌లో పెరుగుతున్న ఫ్యాన్ కల్చర్‌ను ఓ 'వ్యాధి'గా అభివర్ణిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆటగాళ్ల కంటే వ్యక్తిగత అభిమానాన్ని పెంచడం ప్రమాదకరమని హెచ్చరించాడు.**

భారత క్రికెట్‌లో ఫ్యాన్ ఆర్మీల ప్రభావం పెరుగుతుందని రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించాడు. సోషల్ మీడియాలో ఆటగాళ్లపై వ్యక్తిగత అభిమానం పెంచుతూ టీమ్ ప్రయోజనాలను మర్చిపోవడం ప్రమాదకరమంటూ షాకింగ్ కామెంట్స్ చేశాడు. ఇలాంటి అభిప్రాయాలు కొన్నిసార్లు వ్యక్తిగతంగా వినిపించినా ఆ తర్వాత సోషల్ మీడియాలో వేరే పేర్లతో కనిపిస్తున్నాయని అశ్విన్ ఆవేదన వ్యక్తం చేశాడు.

### 'ఇది క్రికెట్‌కు వ్యాధి' -- అశ్విన్

అశ్విన్ మాట్లాడుతూ, "ఇది ఒక వ్యాధిలా మారింది. ఫ్యాన్ ఆర్మీలు సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం చాలా ప్రమాదకరం. ఇది క్రికెట్‌కు మంచిది కాదు" అని వ్యాఖ్యానించాడు. అతను నేరుగా ఆటగాళ్లను తప్పుపట్టకపోయినా, ఈ విధమైన పీఆర్ కార్యకలాపాలు సోషల్ మీడియా యుద్ధాలకు దారితీస్తున్నాయని తెలిపాడు.

### పీఆర్ కల్చర్‌పై షాకింగ్ కామెంట్స్..

ప్రస్తుతం ప్రతి ఆటగాడు ఒక బ్రాండ్‌గా మారిపోయాడని అశ్విన్ అన్నాడు. తమ విలువ పెంచుకోవడానికి పీఆర్ చర్యలు చేయడం సర్వసాధారణమని చెప్పినా, ఇతర ఆటగాళ్లపై విమర్శలు చేయడం తాను ఎప్పటికీ అంగీకరించనని స్పష్టం చేశాడు. ఇలాంటి చర్యలు టీమ్ స్పిరిట్‌ను దెబ్బతీస్తాయని హెచ్చరించాడు.

### గౌతమ్ గంభీర్‌కు మద్దతు..

అశ్విన్, టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను ప్రశంసించాడు. వ్యక్తిగత ఆటగాళ్ల కంటే టీమ్‌ను ముందుంచే వ్యక్తిగా గంభీర్‌ను కొనియాడాడు. "టీమ్ ముందుంటేనే విజయం సాధ్యం" అనే గంభీర్ సిద్ధాంతాన్ని తాను పూర్తిగా సమర్థిస్తున్నట్లు తెలిపాడు.

### రిటైర్మెంట్ తర్వాత అశ్విన్ ప్లాన్స్..

2024లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అశ్విన్, ప్రస్తుతం టీ20 లీగ్‌లలో ఆడాలని భావిస్తున్నాడు. అయితే గాయం కారణంగా కొన్ని టోర్నీలకు దూరమయ్యాడు. భవిష్యత్తులో ప్లేయర్-కోచ్‌గా సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అశ్విన్ భారత క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో రెండో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే.

# బీసీసీఐ బ్లండర్ మిస్టేక్.. రిషబ్ పంత్ కెరీర్ క్లోజ్..?

## ధోని దోస్త్ సంచలన వ్యాఖ్యలు

**టీమ్ ఇండియా స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత క్లిష్ట దశను ఎదుర్కొంటున్నాడు. ఐపీఎల్‌లో 27 కోట్ల భారీ ధర పలికినప్పటికీ, వైట్ బాల్ క్రికెట్‌లో పంత్ స్థానం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. అసలు పంత్‌ను సెలెక్టర్లు కేవలం టెస్టులకే పరిమితం చేస్తున్నారా? మాజీ క్రికెటర్ బద్రీనాథ్ చేసిన షాకింగ్ కామెంట్స్ ప్రస్తుతం సంచలనంగా మారాయి.**



భారత క్రికెట్ సంచలనం రిషబ్ పంత్ ప్రస్తుతం ఫామ్ లేమితో సతమతమవుతున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా లక్నో సూపర్ జెయింట్స్ (ౡూ+) అతడిని రూ. 27 కోట్లకు కొనుగోలు చేసినప్పటికీ, మైదానంలో ఆశించిన ప్రదర్శన కనబరచలేకపోతున్నాడు. దీనిపై చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు సుబ్రహ్మణ్యం బద్రీనాథ్ మాట్లాడుతూ, పంత్ వైట్ బాల్ క్రికెట్ కెరీర్ దాదాపు ముగిసినట్లేనని సంచలన వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

### ఐపీఎల్ 2025: పంత్‌కు ఒక పీడకల..

గత సీజన్ రిషబ్ పంత్‌కు ఏమాత్రం కలిసిరాలేదు. లక్నో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన పంత్, బ్యాటర్‌గా ఘోరంగా విఫలమయ్యాడు. ఆడిన 14 మ్యాచ్‌ల్లో కేవలం 269 పరుగులు మాత్రమే చేసి, 25 కంటే తక్కువ సగటును నమోదు చేశాడు. టోర్నీ చివర్లో ఒక సెంచరీ సాధించినప్పటికీ, అది జట్టు విజయానికి పెద్దగా ఉపయోగపడలేదు. భారీ ధర, కెప్టెన్సీ ఒత్తిడి కారణంగా పంత్ తన సహజసిద్ధమైన దూకుడును కోల్పోయాడని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### సెలెక్టర్ల వ్యూహం: కేవలం రెడ్ బాల్‌కేనా?

బద్రీనాథ్ అభిప్రాయం ప్రకారం, భారత సెలెక్టర్లు ఇప్పుడు పంత్‌ను కేవలం 'రెడ్ బాల్' (టెస్ట్ క్రికెట్) ప్లేయర్‌గా మాత్రమే చూస్తున్నారు. టెస్టుల్లో పంత్ అద్భుతమైన రికార్డు కలిగి ఉన్నప్పటికీ, పరిమిత ఓవర్ల క్రికెట్ (ఉణ×, ౨20) లో అతని స్థానం ఇప్పుడు గాలిలో దీపంలా మారిందని తెలుస్తోంది. సంజు శాంసన్, ఇషాన్ కిషన్, కె.ఎల్. రాహుల్ వంటి సీనియర్లతో పాటు ధ్రువ్ జురెల్, జితేష్ శర్మ వంటి యువ ఆటగాళ్లు అద్భుతమైన ఫామ్‌లో ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.

### తిరిగి రావడం సాధ్యమేనా?

"ఇషాన్ కిషన్, సంజు శాంసన్ ఉన్నంత కాలం పంత్ టీ20 జట్టులోకి రావడం కష్టం" అని బద్రీనాథ్ స్పష్టం చేశాడు. ఒకవేళ ఐపీఎల్ 2026 సీజన్‌లో అసాధారణ ప్రదర్శన చేస్తే తప్ప, వైట్ బాల్ జట్లలో పంత్‌కు చోటు దక్కడం అసాధ్యంగా కనిపిస్తోంది. పంత్ తన ఫామ్‌ను నిరూపించుకుని విమర్శకుల నోళ్లు మూయిస్తాడో లేదో వేచి చూడాలి.

# క్రికెట్ చరిత్రలోనే అసంభవం..

## కేవలం 2 బంతుల్లోనే హ్యాట్రిక్ కొట్టిన మ్యాజిక్ స్పిన్నర్



**ఐపీఎల్ 2026 ప్రారంభం కానున్న వేళ ప్రవీణ్ తాంబే అరుదైన రికార్డు వైరల్ అవుతోంది. 2014లో కేవలం 2 బంతుల్లోనే హ్యాట్రిక్ తీసి ఆయన అసాధ్యమైన రికార్డును నెలకొల్పారు. 41 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు ప్రవీణ్ తాంబే.**

ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఌూ) 19వ సీజన్ మార్చి 28 నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లోనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. ఐపీఎల్ అంటేనే రికార్డుల సముద్రం. గత 18 సీజన్లలో ఎందరో బౌలర్లు హ్యాట్రిక్‌లు సాధించినా, ఒకే ఒక్కడి రికార్డు మాత్రం నేటికీ వింతగా, అద్భుతంగా మిగిలిపోయింది. ఆ రికార్డు సృష్టించిన ఆటగాడు మరెవరో కాదు.. 41 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచిన ప్రవీణ్ తాంబే. ఆయన జీవితం ఆధారంగా కౌన్ ప్రవీణ్ తాంబే అనే సినిమా కూడా వచ్చిందంటే ఆయన ప్రయాణం ఎంతమంది ప్లేయర్లకు స్ఫూర్తిదాయకమో అర్థం చేసుకోవచ్చు.

సాధారణంగా క్రికెట్‌లో వరుసగా మూడు బంతుల్లో ముగ్గురు బ్యాటర్లను అవుట్ చేస్తే దానిని హ్యాట్రిక్ అంటారు. కానీ, ప్రవీణ్ తాంబే మాత్రం కేవలం రెండు లీగల్ బంతుల్లోనే హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టి చరిత్ర సృష్టించారు. 2014 ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న సమయంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (ఖఖ=) మీద ఆయన ఈ అసాధ్యమైన ఫీట్‌ను నమోదు చేశారు. అప్పట్లో ఈ వింత హ్యాట్రిక్ చూసి క్రికెట్ ప్రపంచం నోరెళ్లబెట్టింది. అసలు రెండు బంతుల్లో మూడు వికెట్లు ఎలా సాధ్యమయ్యాయో తెలిస్తే మీరు కూడా ఆశ్చర్యపోతారు.

ఆ మ్యాచ్‌లో 16వ ఓవర్ వేయడానికి వచ్చిన తాంబే.. మొదటి బంతిని గూగ్లీగా వేశారు. ఆ బంతిని ఆడటంలో మనీష్ పాండే తడబడటంతో వికెట్ కీపర్ సంజు శామ్సన్ రెప్పపాటులో స్టంపింగ్ చేశాడు. అయితే, ఆ బంతి వైడ్ కావడంతో అంపైర్ దానిని లీగల్ డెలివరీగా పరిగణించలేదు. కానీ నిబంధనల ప్రకారం బ్యాటర్ అవుట్ అయ్యాడు కాబట్టి వికెట్ తాంబే ఖాతాలోకి చేరింది. ఆ తర్వాత వేసిన మొదటి లీగల్ బంతికి యూసుఫ్ పఠాన్ అవుట్ అవ్వగా, రెండో బంతికి రయాన్ టెన్ డోషేట్ పెవిలియన్ చేరాడు. ఇలా వైడ్ బాల్‌తో కలిపి మూడు వికెట్లు పడటంతో కేవలం రెండు లీగల్ బంతులకే హ్యాట్రిక్ పూర్తయ్యింది.

ఈ రికార్డుతో పాటు ఆ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు పేరిట ఒక అవాంఛిత రికార్డు కూడా నమోదైంది. ఐపీఎల్ చరిత్రలో 100 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం లభించినప్పటికీ, మ్యాచ్ ఓడిపోయిన మొదటి జట్టుగా కేకేఆర్ నిలిచింది. అంతకుముందు 2010లో ఛాంపియన్స్ లీగ్ టీ20లో ఇసురు ఉదానా కూడా ఇలాగే రెండు బంతుల్లో హ్యాట్రిక్ తీయగా, ఐపీఎల్‌లో మాత్రం ప్రవీణ్ తాంబే మాత్రమే ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఈసారి ఐపీఎల్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ గోల్డెన్ రికార్డు గురించి సోషల్ మీడియాలో నెటిజన్లు మళ్లీ చర్చించుకుంటున్నారు.

# పాక్‌కు వెళ్లండి కానీ..

## ఆ నగరానికి మాత్రం వద్దేవద్దు: ఆస్ట్రేలియా

పాకిస్థాన్ సూపర్ లీగ్ (ౡుూ) మార్చి 26 నుంచి ప్రారంభం కానుంది. దీనిలో స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, లబుషేన్, మాక్స్‌వెల్.. తదితర ఆస్ట్రేలియన్ క్రికెటర్లు భాగం కానున్నారు. అలాగే ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్లు టిమ్ పైన్, గిలెస్పీ ఈ లీగ్‌లో కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ లీగ్ నిర్వహణ పాక్ చర్యతో ప్రమాదంలో పడింది. పాకిస్థాన్ ఆర్మీ అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబుల్‌లోని ఓ ఆసుపత్రిపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో దాదాపు 400 మంది అమాయక ప్రజలు తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం తమ క్రికెటర్లు పాక్‌కు వెళ్లొచ్చు కానీ.. ఎట్టి పరిస్థితుల్లోనూ పెషావర్‌లో మాత్రం అడుగు పెట్టొద్దంటూ హెచ్చరిస్తోంది. షెపావర్‌ను ఆస్ట్రేలియా ప్రభుత్వం నో ట్రావెల్ జోన్‌లోకి చేర్చడమే దీనికి కారణం. అయితే ఈ నగరంలోని ఇమ్రాన్ ఖాన్ స్టేడియంలో మార్చి 28న పెషావర్ జల్మీ, రావల్పిండిజ్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. ఈ రెండు జట్లలోనూ ఆస్ట్రేలియా క్రికెటర్లున్నారు. జల్మీ జట్టుకు ఆరోన్ హార్డీ, పిండిజ్ టీమ్‌కు జేక్ ఫ్రేజర్ మెక్ గర్క్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ప్రస్తుతం సందిగ్ధం నెలకొంది. అయితే అత్యవసర పరిస్థితులెదురైతే ఆస్ట్రేలియా ఆటగాళ్లను ప్రైవేట్ విమానాల్లో స్వదేశానికి తరలిస్తామని ఆస్ట్రేలియా ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు పాకిస్థాన్ సూపర్ లీగ్ 11వ ఎడిషన్‌కు ముందు జరిగిన వేలం నుంచి అఫ్గాన్ ఆటగాళ్లు తమ పేర్లను ఉపసంహరించుకున్నారు. లాహోర్‌లో జరిగిన వేలం కోసం ముజీబ్ ఉర్ రెహ్మాన్, సిద్ధిఖుల్లా అటల్, మహమ్మద్ నబీ, వకార్ సలామ్‌ఖేల్, ఫజల్ హక్ ఫరూఖీ వంటి ఆటగాళ్లు పేర్లు నమోదు చేసుకున్నారని ఒక ఫ్రాంచైజీ యజమాని మొదట ధ్రువీకరించారు. కానీ.. అఫ్గానిస్థాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్‌ను పెషావర్ జల్మీ జట్టు నేరుగా తీసుకోవడంపై వ్యతిరేకత రావడంతో వారు తమ పేర్లను ఉపసంహరించుకున్నారని సమాచారం.

# క్రికెట్ దేవుడికే రీప్లేస్‌మెంటా? సందీప్ పాటిల్ సంచలన

**సచిన్ టెండూల్కర్ వన్డే రిటైర్మెంట్ వెనుక ఉన్న షాకింగ్ నిజాన్ని మాజీ సెలక్టర్ అయిన సందీప్ పాటిల్ బయటపెట్టారు. రీప్లేస్‌మెంట్ గురించి చెప్పినప్పుడు సచిన్ షాక్ అయ్యారని , ఆ తర్వాతే రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. క్రికెట్ ప్రపంచంలో దేవుడిగా కొలిచే సచిన్ టెండూల్కర్ మైదానాన్ని వీడి దశాబ్ద కాలం దాటిపోయింది. అయినా సరే ఆయన నెలకొల్పిన రికార్డులు నేటికి చెక్కు చెదరలేదు. అయితే సచిన్ వన్డే క్రికెట్ నుంచి తప్పుకోవడం వెనుక ఉన్న ఒక ఆసక్తికరమైన, షాకింగ్ విషయాన్ని భారత మాజీ చీఫ్ సెలక్టర్ సందీప్ పాటిల్ తాజాగా వెల్లడించారు. 2012లో సచిన్ వన్డేలకు వీడ్కోలు పలికే సమయంలో బీసీసీఐ (దీజజ×) లోపల ఏం జరిగిందనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. సాధారణంగా ఆటగాళ్లు ఫామ్ కోల్పోయినప్పుడు సెలక్టర్లు తప్పించడం మామూలే.. కానీ సచిన్ లాంటి దిగ్గజం విషయంలో సెలక్టర్లు**



**చాలా సున్నితంగా వ్యవహరించాల్సి వచ్చింది.**

సందీప్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. 2012 చివరలో సెలక్షన్ కమిటీ సచిన్ టెండూల్కర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు మరొక ఆటగాడి కోసం వెతకడం ప్రారంభించింది. ఈ విషయాన్ని స్వయంగా సచిన్ కే చెప్పాలని కమిటీ నిర్ణయించింది. అప్పట్లో నాగ్‌పూర్ టెస్ట్ ముగిసిన తర్వాత, సందీప్ పాటిల్ నేరుగా సచిన్ కు ఫోన్ చేసి.. భవిష్యత్తు గురించి మీ ప్లాన్స్ ఏంటి? అని అడిగారు. దానికి సచిన్ ఆశ్చర్యంగా ఎందుకు? అని అడిగితే, మేము మీ స్థానంలో మరొకరిని చూడాలనుకుంటున్నాము అని సందీప్ బదులిచ్చారు. సెలక్టర్ల నోట ఆ మాట వినగానే సచిన్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కాసేపటి తర్వాత మళ్ళీ కాల్ చేసి, మీరు నిజంగానే సీరియస్‌గా చెబుతున్నారా? అని అడిగారట. దానికి సందీప్ పాటిల్ అవును అని సమాధానం ఇచ్చారు. ఆ సమయంలో సచిన్ ఇంకా ఆడాలని కోరుకున్నప్పటికీ, టీమిండియాలో మార్పులు అవసరమని సెలక్టర్లు భావించారు. ఈ సంభాషణ జరిగిన కొన్ని రోజులకే, సరిగ్గా డిసెంబర్ 23, 2012న పాకిస్థాన్‌తో సిరీస్‌కు ముందు సచిన్ తన వన్డే రిటైర్మెంట్‌ను ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సచిన్ తన కెరీర్‌లో ఆఖరి వన్డే మ్యాచ్‌ను మార్చి 18, 2012న ఆసియా కప్‌లో పాకిస్థాన్‌పై ఆడారు. ఆ మ్యాచ్‌లో ఆయన 52 పరుగులు చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. అదే టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్‌పై తన 100వ అంతర్జాతీయ సెంచరీని కూడా పూర్తి చేసి చరిత్ర సృష్టించారు. సచిన్ ని రిటైర్మెంట్ తీసుకోమని తాము ఎప్పుడూ ఒత్తిడి చేయలేదని, కేవలం జట్టు ప్రణాళికలను వివరించామని సందీప్ పాటిల్ స్పష్టం చేశారు. ఆ తర్వాత సచిన్ గౌరవప్రదంగా వన్డేల నుంచి తప్పుకుని, 2013లో తన 200వ టెస్ట్ తర్వాత క్రికెట్ కు పూర్తిగా వీడ్కోలు పలికారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# 31న అనుష్క కొత్త మూవీ అప్‌డేట్



అనుష్క శెట్టి తన తదుపరి భారీ ప్రాజెక్టు 'కథనార్' చిత్రం గురించి ఒక అప్‌డేట్‌ను సోషల్ మీడియాలో విడుదలచేశారు. 'మార్చి 31న మధ్యాహ్నం 1:31 గంటలకు 'కథనార్' సినిమా నుంచి ఒక భారీ సర్ప్రైజ్ ఉండబోతున్న'ట్లు ఆమె ప్రకటించారు. మలయాళ స్టార్ హీరో జయసూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో అనుష్క శెట్టి హీరోయిన్‌గా కనిపించనున్నారు. రోజిన్ థామస్ దర్శకత్వంలో, గోకులం గోపాలన్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 9వ శతాబ్దం నాటి కాలానికి సంబంధించిన కథాంశంతో, మాంత్రిక శక్తులు, ఆధ్యాత్మిక రహస్యాలు, సస్పెన్స్ థ్రిల్లర్ అంశాలతో ఈ మూవీ రూపొందుతోంది. కేరళ జానపద గాథల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది.

# వన్ డైలాగ్‌తో రాశీఖన్నా ప్రచారం..
# వైరల్ అవుతున్న 'ఉస్తాద్' స్టైల్





పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. దర్శకుడు హరీశ్ శంకర్‌తో పవన్ చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఉగాది పండుగ కానుకగా ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడటంతో చిత్రయూనిట్ ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ముఖ్యంగా ఓ పవర్‌ఫుల్ డైలాగ్‌ను వాడుతూ చేస్తున్న ప్రచారం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. సినిమాలోని 'ఇచ్చిపడేసే గోత్రం.. ఇరగదీసే నక్షత్రం' అనే డైలాగ్ విడుదలకు ముందే ట్రెండింగ్‌లో నిలిచింది. ఇదే డైలాగ్‌ను ప్రచారానికి వాడుకుంటూ చిత్రబృందం సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ ప్రమోషన్లలో భాగంగా నటి రాశీఖన్నా ఓ వినూత్నమైన స్టైల్‌లో కనిపించారు. నలుపు రంగు షర్ట్ వెనుక ఈ డైలాగ్‌ను ప్రింట్ చేయించుకుని, ఆ షర్ట్‌తో ఆమె ప్రమోషన్లలో పాల్గొంటున్నారు. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా, రాశీఖన్నా కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు స్వరపరచగా, ఎస్. థమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. సినిమాలో పార్థిబన్, గౌతమి, కేఎస్ రవికుమార్ వంటి ప్రముఖ నటులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

## ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్' రూపంలో
# ఒక మంచి తెలుగు సినిమా
## కథానాయిక శ్రీలీల



గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్తగా కాగా, ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఉగాది కానుగా మార్చి 19వ తేదీన 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం చిత్ర బృందం, ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను నిర్వహించింది. ఈ సందర్భంగా కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ మాట్లాడుతూ.. "ముందుగా మీడియా మిత్రులకు కృతజ్ఞతలు. చాలా రోజుల తరువాత మిమ్మల్ని ఇలా కలవడం సంతోషంగా ఉంది. ఈ ఉగాది 'ఉస్తాద్ ఉగాది' కాబోతుంది. ఒక బిగ్ స్టార్ నుంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్ వచ్చి చాలా కాలమైందని నా అభిప్రాయం. మైత్రి మూవీ మేకర్స్ లాంటి నిర్మాతలను కాపాడుకోవడం నాలాంటి ప్రతి దర్శకుడి బాధ్యత. వీళ్ళు మరిన్ని సినిమాలు తీస్తూ, పది కాలాల పాటు ఇండిస్టీలో ఉండాలి. సినిమా ఆలస్యమైనా ఒక్కసారి కూడా అసహనం ప్రదర్శించలేదు. బడ్జెట్ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. నేను అడిగిన దానికంటే ఎక్కువే ఇచ్చారు. మా నిర్మాతల మద్దతు వల్లే సినిమా ఇంత బాగా వచ్చింది. అలాగే చివరి నిమిషంలో హీరోలా వచ్చి, నేపథ్య సంగీతం బాధ్యత తీసుకున్న తమన్ కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇలాంటి అన్ని ఎమోషన్స్ ఉన్న సినిమాకి కేవలం 12-13 రోజుల్లో అద్భుతమైన నేపథ్య సంగీతం అందించాడు. ఈ సినిమాకి అన్నీ కుదిరాయి. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో భాగమైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. ఇలాంటి పూర్తిస్థాయి ఎంటర్‌టైనింగ్ సినిమా చూసి కాలమైందని చూసిన ప్రతి ఒక్కరూ కనీసం పది మందికి చెబుతారు. అభిమానులు మళ్ళీ మళ్ళీ చూస్తారు." అన్నారు. నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ.. "చాలా చాలా సంతోషంగా ఉంది. పవన్ కళ్యాణ్ గారితో సినిమా చేయాలనేది మా కల. అది ఉస్తాద్ భగత్ సింగ్ తో నెరవేరింది. ఐదారేళ్ళ క్రితం సినిమా చేయాలనుకున్నాము. కోవిడ్, పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం వంటి కారణాల వల్ల.. గతేడాది జూన్ లో సినిమా ప్రారంభించాము. నిర్మాతలుగా మాకు ఎటువంటి ఒత్తిడి లేకుండా, ఒక పిక్నిక్ లాగా సినిమా అయిపోయింది. దానికి ముఖ్య కారణం మా దర్శకుడు హరీష్ శంకర్ గారు. పవన్ కళ్యాణ్ ప్రజా సేవలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ, ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్లాన్ చేసి షఉటింగ్ పూర్తి చేశారు హరీష్ గారు. ప్రతి మూవీ ఎలా ఉంటే.. సంవత్సరానికి పది మూవీలు హ్యాపీ తీయొచ్చు. సరిగా నిద్ర కూడా పోకుండా పోస్ట్ ప్రొడక్షన్, పబ్లిసిటీ కార్యక్రమాలు కూడా చూసుకున్నారు. ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ఇప్పటికీ నాలుగైదు సార్లు చూశాను. ఎన్నిసార్లు చూసినా ఒకటే అభిప్రాయం. ఇది పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్. వినోదం, భావోద్వేగాలతో పాటు అన్ని అంశాలు నిండి.. ఆద్యంతం సినిమా ఆకట్టుకునేలా ఉంటుంది. ఇదొక పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. రేపు ఉదయం 5 గంటల నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రీమియర్ షోలు ప్రారంభమవుతాయి. అందరూ ఈ సినిమాని చూసి ఎంజారు చేస్తానని ఆశిస్తున్నాము." అన్నారు. కథానాయిక శ్రీలీల మాట్లాడుతూ.. "ముందుగా అందరికీ ఉగాది శుభాకాంక్షలు. తెలుగు నూతన సంవత్సరాది కానుకగా మా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విడుదలవుతుండటం మాకు చాలా చాలా ప్రత్యేకం. సినిమా పట్ల మేము చాలా నమ్మకంగా ఉన్నాము. ఒక మంచి తెలుగు సినిమా ఉగాదికి వస్తుంది. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ప్రేక్షకుల మా సినిమాని ఆదరించాలని కోరుకుంటున్నాము. మీడియా మద్దతు మరువలేనిది. రాశి ఖన్నా స్వీట్ హార్ట్. మా ఇద్దరి మధ్య సన్నివేశాలు లేనప్పటికీ, ఈ సినిమా చిత్రీకరణ సమయంలో ఒకరికొకరం దగ్గరయ్యాం. ఈ సినిమా మాకు చాలా ముఖ్యమైనది. అందరూ చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను." అన్నారు. కథానాయిక రాశి ఖన్నా మాట్లాడుతూ.. "రేపు ఉస్తాద్ భగత్ సింగ్ ప్రేక్షకుల ముందుకు వస్తుండటం చాలా ఉత్సాహంగా ఉంది. 2026 లో నా మొదటి సినిమా, ఉగాదికి వస్తుంది, పైగా పవన్ కళ్యాణ్ గారు ఉన్నారు. ఇది నాకు ట్రిపుల్ సెలబ్రేషన్. అందరం ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాము. ముఖ్యంగా హరీష్ శంకర్ గారు నిద్ర కూడా మానుకొని సినిమా కోసం కష్టపడ్డారు. ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు సినిమా కోసం ఎంతో చేశారు. ఉస్తాద్ భగత్ సింగ్ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను." అన్నారు.

# 26న 'యూత్' సినిమా విడుదల



తమిళ నటుడు కరుణాస్ వారసుడు కెన్ కరుణాస్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం యూత్. ఈ మూవీకి కెన్ కరుణాస్ స్వీయ దర్శకత్వం వహిస్తున్నారు. జీవీ ప్రకాష్‌కుమార్ ఉచితంగా సంగీతాన్ని అందించారు. ఇటీవలే తమిళ ట్రైలర్ విడుదల చేయగా మంచి స్పందన లభించింది. తెలుగులోనూ విడుదల చేయగా బాగా ట్రెండింగ్‌లో ఉంది. 'మీకు పుట్టినవాడు సాధారణమైన అబ్బాయి కాదు మేడమ్. ఆ దేవుడే మీకు బిడ్డగా పుట్టాడు. వాడిని బ్యాడ్ బార్చుతో చేరనివ్వకండి' అన్న సంభాషణతో వీడియో మొదలవుతుంది. తీరా హీరో తనను ముగ్గురమ్మాయిలు ప్రేమిస్తున్నారని తెగ సంబరపడిపోతాడు. ఫైటింగ్, లవ్, కామెడీకి ఏమాత్రం కొదవ లేనట్లుగా చూపించారు. ఎంటర్‌టైన్మెంట్ గ్యారెంటీ అనేలా ట్రైలర్ కట్ చేశారు. ఈ సినిమా ఈనెల 26న విడుదల కానుంది.

# 'అద్దిరా లెక్క' పాట విడుదల



సంగీత దర్శకుడు, కథానాయకుడు జీవీ ప్రకాష్‌కుమార్ నటిస్తున్న నూతన చిత్రం 'హ్యాపీ రాజ్'. హీరో- డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్ వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన మరియా రాజా ఎలాంచెజియన్ దర్శకత్వం వహించారు. బియాండ్ పిక్చర్స్ బ్యానర్‌పై జైవర్ధ నిర్మించారు. మ్యాడ్ ఫేం శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్‌ఎల్పీ ద్వారా ఈనెల 27న తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. నిర్మాతలు ఫస్ట్ సింగిల్ 'అద్దిరా లెక్క' సాంగ్‌ను విడుదల చేశారు. సంగీత దర్శకుడు జస్టిన్ ప్రభాకరన్ ఈ పాటను కంపోజ్‌చేశారు. గాయకుడు గోవింద్ ప్రసాద్ పాడారు. రెహ్మాన్ సాహిత్యాన్ని అందించారు. జీవీ ప్రకాష్‌కుమార్ డ్యాన్స్‌తో అదరగొట్టారు. సోషల్ మీడియాలో ఈ పాట ట్రెండింగ్‌లో ఉంది.

# నా అనుమతి లేకుండానే ఆ పని చేశారు..
## వివాదాస్పద పాటపై నోరా ఫతేహి క్లారిటీ





బాలీవుడ్ నటి, డ్యాన్సర్ నోరా ఫతేహి... 'కేడీ: ది డెవిల్' సినిమాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాటపై చెలరేగిన వివాదంపై ఎట్టకేలకు స్పందించారు. ఈ పాట హిందీ వెర్షన్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, దాని నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ఓ వీడియో సందేశం ద్వారా స్పష్టం చేశారు. ఈ పాటను తన అనుమతి లేకుండానే హిందీలో డబ్ చేసి విడుదల చేశారని ఆమె ఆరోపించారు. ఈ పాటను తాను మూడేళ్ల క్రితం కన్నడలో షఉట్ చేశానని, దానిని తర్వాత ఎలా మారుస్తారో తనకు తెలియదని నోరా తెలిపారు. "ఇది ఒక పెద్ద సినిమా కావడం, సంజయ్ దత్ లాంటి స్టార్ ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌కు ఒప్పుకున్నాను. వాస్తవానికి ఇది 'నాయక్ నహీ ఖల్నాయక్ హూ మెయిన్' పాటకు రీమేక్ అనుకున్నాను" అని ఆమె వివరించారు. కన్నడలో సాహిత్యం తనకు అర్థం కాకపోవడంతో వారు చెప్పిందే నమ్మానని, అందులో అసభ్యత ఏమీ అనిపించలేదని అన్నారు. అయితే, హిందీలో డబ్ చేసి విడుదల చేయడానికి తన నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని, ఈ విషయం తన దృష్టికే రాలేదని ఆమె ఆరోపించారు. పాట లాంచ్ ఈవెంట్‌లో కూడా తనకు ఇబ్బందికరమైన అనుభవాలు ఎదురయ్యాయని నోరా వెల్లడించారు. లిరికల్ వీడియోలో బాగాలేని ఫొటోలు, తనతో పాటు సంజయ్ దత్‌కు సంబంధించిన ఏఐ ఫొటోను వాడటం చూసి చాలా చిరాకు పడ్డానని, అయినా నిగ్రహం పాటించానని చెప్పారు. హిందీ వెర్షన్ చూసిన తర్వాత ఇది కచ్చితంగా విమర్శల పాలవుతుందని ముందే ఊహించి, ఈ విషయం దర్శకుడికి చెప్పి ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన విమర్శల కారణంగానే మేకర్స్ పాటను తొలగించారని, అందుకు తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. "ఇలాంటి కంటెంట్ సృష్టించే దర్శక, నిర్మాతలు బాధ్యత వహించాలి. ఇకపై నేను మరింత జాగ్రత్తగా ఉంటాను" అని నోరా పేర్కొన్నారు.

## హీరోల ఆలోచనా విధానంపై
# తాప్సీ విమర్శలు



బాలీవుడ్ 'ఫైర్ బ్రాండ్' తాప్సీ పన్ను తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో మరోసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా అగ్ర హీరోల అభద్రతా భావం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. తాప్సీ తన తాజా ఇంటర్వ్యూలో హీరోల ఆలోచనా విధానాన్ని ఎండగట్టింది. కథానాయికలకు ప్రాధాన్యత ఉన్న సినిమాల్లో నటించడానికి చాలా మంది స్టార్ హీరోలు సిద్ధంగా లేరని ఆమె విమర్శించింది. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక చేదు అనుభవాన్ని తాప్సీ పంచుకుంది. "ఒక సినిమాలో నేను డబుల్ రోల్ చేస్తున్నప్పుడు, సదరు హీరో ఆ ప్రాజెక్ట్‌ను రిజెక్ట్ చేశాడు. దానికి ఆయన చెప్పిన కారణం ఏంటంటే.. సినిమాలో హీరోయిన్ పాత్రకు ఎక్కువ నిడివి, ప్రాధాన్యత ఉంటే చివరకు ప్రేక్షకుల సానుభూతి, ప్రశంసలు ఆమెకే దక్కుతాయని ఆయన భయపడ్డాడు. అంతకుముందే ఆ హీరోతో తాను కలిసి పనిచేసినప్పటికీ... కేవలం తన పాత్రకు ప్రాధాన్యత ఎక్కువగా ఉందనే అభద్రతా భావంతో ఆయన వెనక్కి తగ్గడం నన్ను ఆశ్చర్యపరిచింది" అని తాప్సీ వెల్లడించింది. కేవలం సీనియర్ హీరోలే కాదు, ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్న యువ హీరోలు కూడా హీరో పాత్ర నిడివి తక్కువగా ఉంటే అటువంటి సినిమాలకు దూరంగా ఉంటున్నారని ఆమె విమర్శించింది. హీరోయిన్ డామినేట్ చేస్తుందనే భయంతో మంచి కథలను వదులుకోవడం వల్ల చిత్ర పరిశ్రమలో సమానత్వం అనేది ప్రశ్నార్థకంగా మారుతోందని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం తాప్సీ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339